


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 20-03-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 186 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ఏపీ టెట్ ఫలితాలు విడుదల




అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష ( టెట్) ఫలితాలు సోమవారం సాయంత్రం విడుదలయ్యాయి. ఈ ఫలితాలను గేట్ వే హోటల్‌లో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు విడుదల చేశారు.

### ఉభయ సభలు

## సమావేశం.. వాయిదా..

- అవిశ్వాసంపై జరగని చర్చ
- అన్నాడీఎంకే, తెరాస సభ్యుల ఆందోళనతో
- కొనసాగిన వాయిదాల పర్వం



దిల్లీ: కేంద్రంపై తెదేపా, వైకాపా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలపై సోమవారం కూడా లోక్‌సభలో చర్చ జరగలేదు. సభ్యుల ఆందోళన మధ్య స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. తొలుత ఆమె తెదేపా, వైకాపా సభ్యుల అవిశ్వాస తీర్మానాలను స్వీకరించారు. సభ్యులు సభ సజావుగా సాగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించేందుకు సభ్యులు వీలు కల్పించాలంటూ కోరారు. కానీ, కావేరీ అంశంపై అన్నాడీఎంకే, రిజర్వేషన్ల అంశంపై తెరాస సభ్యులు వెల్‌లోకి వెళ్లి తమ ఆందోళన కొనసాగించారు. ఈ నేపథ్యంలో సభ్యుల నిరసనల మధ్య లెక్కింపు సాధ్యం కాదంటూ లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేశారు.

**కొనసాగిన వాయిదాల పర్వం**

తెదేపా, వైకాపా ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొనడంతో సోమవారం దీనిపై లోక్‌సభలో చర్చ జరుగుతుందని అనుకున్నారు. కానీ ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే తెరాస, అన్నాడీఎంకే సభ్యులు ఆందోళన చేయడంతో సభ 12 గంటలకు వాయిదా పడింది. గంట తర్వాత సభ ప్రారంభమయ్యాకా అదే పరిస్థితి నెలకొంది.

కావేరీ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడీఎంకే, రిజర్వేషన్ల పెంపు అంశంపై తెరాస సభ్యులు స్పీకర్ వెల్‌లోకి ప్రవేశించి నినాదాలు చేశారు. వారి ఆందోళన మధ్యే స్పీకర్ కాసేపు ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. అయినా వారు బిగ్గరగా నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. సభ సజావుగా సాగేందుకు సభ్యులు సహకరించాలని.. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించేందుకు వీలు కల్పించాలని స్పీకర్ కోరినా వారు వినిపించుకోలేదు.

దీంతో సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు.

**అన్ని అంశాలపై చర్చకు సిద్ధం: రాజ్‌నాథ్**

ప్రభుత్వం అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉందని కేంద్ర హోం తరువాయి 2లో

### కోమటిరెడ్డి, సంపత్‌కు

## హైకోర్టులో ఊరట



హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్‌కుమార్ శాసన సభ్యత్వం రద్దు వ్యవహారంపై తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టులో విచారణ పూర్తయింది. సోమవారం ఉదయం నుంచి విచారించిన ఉన్నత న్యాయస్థానం 6 వారాల వరకు ఎన్నికల నోటిఫికేషన్ తరువాయి 2లో

### తృతీయ ఫ్రంట్‌కు

## కార్యాచరణ ప్రారంభం

### కోల్‌కతాలో కేసీఆర్‌కు ఘనస్వాగతం



కోల్‌కతా: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కోల్‌కతాలోని సచివాలయానికి చేరుకున్నారు. తొలుత కోల్‌కతా విమానాశ్రయంలో ఆయనకు పశ్చిమ్‌బంగ మంత్రి మంత్రి పూర్ణేన్దు బసు తదితరులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సచివాలయం వద్ద పశ్చిమ్‌బంగ సీఎం మమతా బెనర్జీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసిన మమత సాదర స్వాగతం పలికారు. ఇరువురి నేతల భేటీ ప్రారంభమైంది. దేశంలో కాంగ్రెసేతర, భాజపాయేతర ఫ్రంట్ ఏర్పాటు చేస్తానని కొద్దిరోజుల క్రితం ప్రకటించిన తరువాయి 2లో

### ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై చర్చించా



దేశ ప్రజలంతా మరో ప్రత్యామ్నాయం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని తరువాయి 2లో

### పరిస్థితులే నాయకుల్ని సృష్టిస్తాయి



మమతా బెనర్జీ మాట్లాడుతూ.. దేశం మార్పు కోరుకుంటోందని, బలమైన ఫెడరల్ తరువాయి 2లో

## భాజపా - వైకాపాలు కుమ్మక్కయ్యాయి

### లాలూచీ రాజకీయాలకు పరాకాష్ఠ
### ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి: భాజపాతో వైకాపా కుమ్మక్కైందని ప్రజలకు స్పష్టంగా తెలిసిపోయిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వంగివంగి నమస్కారాలు చేసినప్పుడే వారి లాలూచీ అర్థమైందన్నారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో చంద్రబాబు సోమవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఏపీకి జరిగిన అన్యాయంపై, తెదేపా అవిశ్వాస తీర్మానంపై జాతీయ స్థాయిలో విపరీతంగా చర్చ జరుగుతోంది. వివిధ పార్టీలు మనకు మద్దతు ప్రకటించాయి. అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టకుండా సభ వాయిదా వేస్తే ఎంపీలు యథావిధిగా ఆందోళన కొనసాగించాలి. రాష్ట్రానికి న్యాయం చేయాలని మాత్రమే మనం అడుగుతున్నాం. న్యాయం కోరిన వారిపై భాజపా యుద్ధం చేయాలని చూస్తోంది. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో చెప్పింది. అలాంటప్పుడు కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటి? కేసుల మాఫీ కోసమే వైకాపా అధినేత జగన్ అప్పుడు కాంగ్రెస్‌తో, ఇప్పుడు భాజపాతో లాలూచీ పడ్డాడు. వీళ్ల కేసుల కోసం రాష్ట్ర భవిష్యత్‌ను తాకట్టు పెట్టడం ఎంతవరకు సమంజసం? భాజపా ఒక పార్టీతో అవిశ్వాస తీర్మానం పెట్టించి.. మరోపార్టీతో ఆందోళన చేయించాలని చూస్తోంది. సభ వాయిదా వేసుకుపోవాలని చూడటం లాలూచీ రాజకీయాలకు పరాకాష్ఠ కాదా?

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇప్పుడే ఎందుకు యూ టర్న్ తీసుకున్నారో అందరికీ తెలుసు. నాలుగేళ్లుగా విమర్శించని వ్యక్తి ఇప్పుడే ఎందుకు విమర్శలు చేస్తున్నారు. తప్పుడు పనులు చేసేవారు దొంగాట ఆడుతున్నారు. లాలూచీ రాజకీయాలను బయటపెట్టాలి. కుట్ర రాజకీయాలను ఎండగట్టాలి. ఏపీ ప్రజల హక్కులపై రాజీపడే ప్రస్తకే లేదు. విభజన చట్టంలోని తరువాయి 2లో




ప్రత్యేక హోదా అమలుకోరుతూ నినాదాలు చేస్తున్న వైకాపా నగర అధ్యక్షుడు మళ్ళ విజయప్రసాద్, ఉత్తర సమన్వయకర్తలు సనపల చంద్రమౌళి, సత్తి రామకృష్ణారెడ్డి, ఉషాకిరణ్, వార్డు అధ్యక్షులు బొడ్డేటి నాగేశ్వరరావు మరియు అన్ని అనుబంధ సంఘాల నాయకులు

### భాజపాతో కలిసిన బాబువి

## మోసపూరిత వాగ్దానాలు

- బాబు పొత్తువల్ల సాధించింది శూన్యం
- సీఎం హామీలు నమ్మి ప్రజలు మోసపోయారు
- వైకాపా చేసిన పోరాటాలతోనే ఏపీకి న్యాయం
- నగర పార్టీ అధ్యక్షుడు మళ్ళ విజయప్రసాద్
- మానవహారం నిర్వహించిన వైకాపానేతలు
- రహదారుల నిర్బంధం .. పోలీసుల అరెస్టులు

విశాఖపట్నం: భాజపా పొత్తుతో అధికార పీఠమెక్కిన తెదేపా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికార దర్పంతో, భాజపా నేతల అండతో ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కారు. ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన కేంద్ర నాయకులు హోదా ఇవ్వలేదు సరికదా దానికి తత్సమాన ప్రతిపత్తిగల ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రజలను బుజ్జగించారు. భాజపాను నమ్మి బాబు నవ్వులపాలయ్యారని, బాబువి సిగ్గుమాలిన చర్యలను విశాఖ నగర వైకాపా అధ్యక్షుడు మళ్ళ విజయప్రసాద్ విమర్శించారు. సోమవారం ఎన్ఎడి కొత్త రోడ్డు, మద్దిలపాలెం, జగదాంబ తరువాయి 2లో




## ప్రత్యేక హోదా పెద్ద విషయమేం కాదు

### రాష్ట్రానికి కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందడమే ముఖ్యం

### అవినీతిపై కేంద్రం విచారణ జరపాలి .. జనసేన అధినేత పవన్ కల్యాణ్



అమరావతి: రాష్ట్ర విభజన కారణంగా ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా అనేది పెద్ద విషయం కాదని.. పేరు ఏదైనా కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందడమే ముఖ్యమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పారు. ఓ ఆంగ్ల వార్తా ఛానల్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో తమ డిమాండ్లు నెరవేరే వరకూ భాజపాతో కలిసే అవకాశం లేదని.. తాము తమ సొంత దారిలో వెళ్తున్నామంటూ పేర్కొన్నారు. ఎన్నికల సమయానికి కూటమిలో చేరాలా? లేక సొంతంగా పోటీ చేయాలో నిర్ణయిస్తామన్నారు.

**అవినీతిపై కేంద్రం విచారణ జరపాలి**

తెదేపా ప్రభుత్వంపై తాను చేసిన అవినీతి ఆరోపణలపై పవన్ స్పందిస్తూ తాను అకస్మాత్తుగా ఇప్పుడు ఆరోపణలు చేయడం లేదని.. గత నాలుగేళ్లుగా తాను ఈ అంశాన్ని లేవనెత్తుతున్నానని చెప్పారు. కానీ సీఎం చంద్రబాబు ఈ సమస్యను ఏనాడూ తీవ్రంగా తరువాయి 2లో



# మీ-కోసం... వినతుల వెల్లువ



విజయనగరం: జిల్లా కలక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీ-కోసం కార్యక్రమంలో 130 వినతులు వచ్చాయి. ముఖ్యంగా భూ సమస్యలు వ్యక్తిగత సమస్యలు వినతుల్లో చోటు చేసుకున్నాయి. జామి మండలం కుమరాం గ్రామానికి చెందిన లవుడు సత్యం వివిధ సర్వే నెంబర్లులో ఉన్న తనభూమికి పాసుపుస్తకాలు ఇచ్చారు కానీ, 1బిలో నమోదు చేయలేదని , వెంటనే సమస్య పరిష్కరించమని కోరాడు. ఆర్.బి.పురం నుంచి ఒక అర్జీదారుడు తన భూములు ఆన్‌లైన్ చేయాలని కోరాడు. దత్తిరాజేరు ఒడలం షికారుగంజి గ్రామస్థుడు తన తండ్రికి ఇచ్చిన డి. పట్టా భూమి వేరొకరు ఆక్రమించారని తెలిపాడు. గంట్యాడ మండలం కరకకవలసకు చెందిన భూమిలో 1992లో ఇళ్ళు మంజూరు చేశారని అయితే ఆ భూమి పురపాలక పరిధిలోనిదా? లేదా పంచాయితీకి చెందినదా? తెలపాలని కొందరు అర్జి ఇచ్చారు. చందులూరు గ్రామంలోకోనేరు గట్టును కొందరు ఆక్రమించుకున్నారని వారిని తొలగించాలని గ్రామస్థులు తెలిపారు. ఇక డయిల్ యువర్ కలక్టర్ గ్రీవన్సీలో అయితు వినతులు వచ్చాయి. గ్రీవిన్స ప్రారంభం కాకముందు జాయింట్ కలక్టర్-2 కె.నాగేశ్వరరావు, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ న్యూట్రి గార్డెన్లు ఏర్పాటు చేయడానికి వెంటనే తాహసిల్దార్లు, ఎం.పి.డి.ఓలు స్థలాలు గుర్తించాలని ఆదేశించారు. అలాగే ఎఫ్ఓటి జనరేషన్, గృహనిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం చేసి త్వరిత వారికి బిల్లులు చెల్లింపు చేయాలని ఆదేశించారు. డి.ఆర్.ఓ ఆర్.ఎస్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న మహిళలు లైగింక వేధింపులకు గురికాకుండా ,వాటిని నివారించేందుకు లైంగిక వేధింపుల నివారణా కమిటీలను ఏర్పాటు చేసి సంబంధిత సమాచారం ఐసిడిఎస్ సంచాలకులకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జాయింట్ కలక్టర్-2 కె.నాగేశ్వరరావు, డి.ఆర్ఓ ఆర్.ఎస్.రాజ్‌కుమార్‌లతో పాటు ఉప కలక్టర్ పద్మావతి, బాలాత్రిపుర సుందరి, జెడ్పీ సిఇఓ టి.వేంకటేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫర ఎస్.ఇ ఎం.వి.రమణమూర్తి, సాంఘీక సంక్షేమ శాఖ డి.డి.కె. సునీల్ రాజ్ కుమార్, వ్యవసాయశాఖ జె.డి.లీలావతి, ఉద్యానవన శాఖ డి.డి.పి.ఎన్.వి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నూకాలమ్మ ఉత్సవాలకు హుండీ ఆదాయం రూ 9.78 లక్షలు



భీమునిపట్నం : శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ గ్రామదేవత ఉత్సవాల సందర్భంగా ఎండోమెంట్ కార్యనిర్వహణాధికారి కీర్తి.శ్రీనివాసరావు,ఇన్ స్పెక్టర్ మంగపూడి శ్రీదర్,ఆలయ పూజారులు చౌదరి సత్యరాజ్ ,నాగ వెంకటేష్, ఉత్సవ కమిటీ ,నూకాలమ్మట్రస్ట్, ఆధ్వర్యంలో హుండీ లలో ఉన్న నగదును తీసి సుమారు 30 మంది శ్రీహరి సేవాదళ్ సభ్యులు,ఉత్సవ కమిటీ సభ్యులు నగదును లెక్కించారు. 2017 లో కన్నా ఈ సంవత్సరం 74,297 ఎక్కువ వచ్చిందని ఎండోమెంట్ కార్యనిర్వహణాధికారి కీర్తి.శ్రీనివాస రావు అన్నారు.2017 లో మొత్తం 9,04,367, రూపాయలు రాగా 2018 లో టిక్కెట్లు ద్వారా 5,15,555,హుండీ ద్వారా 4,63,109, మొత్తం 9,78,664 వచ్చాయని చెప్పారు,ఈ కార్యక్రమం లో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కాసరపు నాగరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు వాసుపల్లి కొండబాబు, ప్రధాన కార్యదర్శి కోశాధికారి గిడుతూరి శ్రీనివాసరావు, పలుకూరి శ్రీనివాస రావు, అర్గనైజింగ్ సెక్రటరి, గాడు అప్పల నాయుడు (ఆనంద్), కో ఆర్డినేటర్ కాసరపు పెద్ద ఎల్లాజీ, భీమిలి డివిజన్ టి.డి.పి.అధ్యక్షులు గంటా.నూకరాజు,ఉత్సవ కమిటీ సభ్యులు, మారోజు గొల్లబాబు,వి.తాతాజీ వాసుపల్లి ఎల్లాజీ, అల్లిపిల్లి.నరసింగరావు, కె.రమణబాబు, మైలపల్లి లక్ష్మణరావు, కె. అప్పన్న, ఎస్.జోగా రావు ట్రస్ట్ బోర్డు సభ్యులు, చిన్నికుమారి లక్ష్మి, ఎండోమెంట్ సిబ్బంది పి.రాజు పాల్గొన్నారు.

## ఆంధ్రులకు అపర సంజీవి ప్రత్యేక హోదా



విజయనగరం : ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు, ఐదు కోట్ల ఆంధ్రులకు అపర సంజీవని వంటి ప్రత్యేక హోదాను సాధనకోసం మొదట నుండి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని పార్టీ నగరపాలక అధ్యక్షులు ఆశపు వేణు అన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, ఎమ్మెల్సీ కోల గట్ల వీరభద్రస్వామి సూచనల మేరకు విజయనగరం నియోజక వర్గం ఆధ్వర్యంలో ప్రజా సంకల్ప మానవహారం సోమవారం పట్టణంలో గంటస్తంబం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశపువేణు, నడిపేన శ్రీనివాసరావులు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతి వెంకటరమణమూర్తి సాక్షిగా ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్ర బాబు ప్రమాణం చేసి ప్రజల ద్వారా పదవులు పొంది నేడు ప్రజలకు కుచ్చుటోపి పెట్టారని అన్నారు. పట్టణ యువజన సంఘం అధ్యక్షులు అల్లు చాణిక్య మాట్లాడుతూ ప్రత్యేక హోదా రాకపోవడం వలన పరిశ్రమలు రాక యువతకు ఉపాది లేక ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికలకు ముందు బాబు వస్తే జాబు అని యువతను నమ్మించి నేడు యువతనను నయవంచన చేసారని అన్నారు. ప్రజా సంకల్ప మానవహారం కార్యక్రమానికి మద్దతుగా సిపిఐ నాయకులు కామేశ్వరరావు, బుగత అశోక్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్‌వివి రాజేష్, యువ జన సంఘం అధ్యక్షులు సంగంరెడ్డి బంగారునాయుడు, బొద్దన అప్పారావు, జివివి రంగ, పట్నాన పైడిరాజు, మారం బలబ్రహ్మారెడ్డి, సత్తరపు శంకర్, మజ్జి త్రినాధ్, బోగి రమణ, పిళ్ల వేణు, ఇసరపు రామకృష్ణ, కొసర నారాయణరావు, చిన్ని రవితేజ, ఫణి రాజశేఖర్, వేముల అశోక్, బి.అప్పలరాజు, పి.కృష్ణ, ఐ.శ్రీను, రమేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉద్యానవన శాఖలో ఇంటర్వ్యూలు

విజయనగరం: ఉద్యానవన శాఖలో బహుళ ప్రయోజన విస్తరణ అధికారుల ఇంటర్వ్యూలు ఈనెల 20వ తేదీన జిల్లా జాయింట్ కలక్టర్-2 కార్యాలయంలో నిర్వహిస్తున్నామని జిల్లా జాయింట్ కలక్టర్-2 కె.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు కాల్‌లెటర్లు పంపించామని అలాగే ఫోన్ ద్వారా కూడా సమాచారం ఇచ్చామని తెలిపారు. హాజరయ్యే అభ్యర్థులు విధిగా వారి విద్యార్హత, మరియు అనుభవం తెలిపే ధృవపత్రాలు ఒరిజనల్స్ తేవాలని, లేనిచో అనర్హులౌతారని తెలిపారు.

## దాకమర్రి గ్రామంలో దళిత తేజం



భీమునిపట్నం : భీమిలి మండలం దాకమర్రి గ్రామంలో ఈరోజు దళిత తేజం కార్యక్రమం జరిగింది. ముందు గా నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ విజయ్ బాబు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసారు. అనంతరం దళిత వాడలో వున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే నీరు చెట్టు కార్యక్రమంలో భాగంగా ఊట గెడ్డకు చెక్ డామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి మండల ఎంపీపీ యరబాల కృష్ణవేణి అనిల్ ప్రసాద్, జెడ్పీటీసీ అప్పారావు జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు గాడు వెంకటప్పడు, భీమిలి మండల పార్టీ ప్రెసిడెంట్ డి ఏ ఎన్ రాజు, మాజీ వైస్ ఎంపీపీ పాసి నరసింహారావు, దాకమర్రి సర్పంచ్ అల్లు చిన్నయ్య, దళిత నాయకులు , పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులపై తక్షణ చర్యలు



జిల్లా ఎస్పీ జి. పాలరాజు

విజయనగరం : జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. పాలరాజు సోమవారం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వ్యధ విభాగానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 20 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు.ఈ ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించి, ఫిర్యాదుదారులతో మాట్లాడి, ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు, వాటిపై చర్యలు చేపట్టేందుకు సదరు ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు పంపారు. పార్వతీపురం పట్టణానికి చెందిన పద్మ ఫిర్యాదు చేస్తూ తన భర్త మద్యానికి అలవాటు పడి తనను, తన పిల్లలను తరుచూ కొడుతున్నట్లుగా, తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తు న్నట్లుగా తెలిపారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఇరువురిని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపర్చి, సమస్యను పరిష్కరించి, ఫిర్యాదికి న్యాయం చేఆయల్సిందిగా మహిళా పిఎస్ డిఎస్పీని ఆదేశించారు. ఎస్. కోటకు చెందిన పిల్ల అప్పలనాయుడు ఫిర్యాదు చేస్తూ ఎలక్ట్రికల్ డిపార్టుమెంటులో లైనుమేన్‌గా పనిచేయుచున్న చుక్క రమణ మరొక ఆసామీ సహాయంతో తన కుమారుడికి నేవల్ డాక్‌యార్డులో ఉద్యోగం కల్పిస్తామని, నమ్మించి తన వద్ద నుండి రూ. 2 లక్షలు తీసుకొన్నట్లు, ఇంత వరకు ఎటువంటి ఉద్యోగం కల్పించలేనట్లు, డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని, న్యాయం చేయమని కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఈ ఫిర్యాదుపై కేసును నమోదు చేయా ల్సిందిగా ఎస్. కోట సిఐను ఆదేశించారు. రామభద్రపురం మండలం నాయుడు వలసకు చెందిన నారాయణమ్మ ఫిర్యాదు చేస్తూ తన ఇంటికి దగ్గరలో ఉంటున్న లక్ష్మి అనే వ్యక్తి తమ ఖాళీస్థలాన్ని ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లున్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఫిర్యాదుదారి వృద్ధురాలు అయినందున విచారణ చేపట్టి, సమస్యను పరిష్కరించాల్సిందిగా పార్వతీపురం ఎఎస్పీని ఆదేశించారు.

సాలూరు మండలానికి చెందిన చోడిపల్లి చిరంజీవికి పాండ్రువలసలో భూమి ఉన్నట్లు, సదరు భూమిలో గల చింతచెట్లుకు కాసిన చింతపండును అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు పట్టుకొని పోయినట్లు, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ పూర్తిస్థాయి విచారణ చేపట్టి, నివేదిక అందజేయాల్సిందిగా పార్వతీపురం ఎఎస్పీని ఆదేశించారు. గరుగుబిల్లి మండలానికి చెందిన కేతుబిల్లి రామినాయుడు ఫిర్యాదు చేస్తూ తన చిన్న కుమారుడు వ్యసనాలకు అలవాటుపడి తన ఆస్తిని పొందేందుకుగాను తనను చంపేందుకు ప్రయత్నిస్తున్నాడని, అతని నుండి తనకు ప్రాణభయం ఉన్నందున అతనిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఫిర్యాదిదారుడు వృద్ధుడు అయినందున, పూర్తి స్థాయి విచారణ చేపట్టి, న్యాయం చేయాల్సిందిగా పార్వతీపురం ఎఎస్పీని ఆదేశించారు. బలిజిపేట మండలంకు చెందిన గురుమూర్తి అంపావల్లి పోస్టాఫీసులో గత 15 సంవత్సరాలుగా డబ్బులు జమ చేసినట్లు, అవి నేడు మెట్యూర్టీ పొంది రూ. 70 వేలురావాల్సి ఉండగా, సదరు నగదును పోస్ట్‌మేన్ రమేష్ అతని పేరున మార్చుకొని, డబ్బులను స్వాహా చేసినట్లు, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ పూర్తి స్థాయి విచారణ చేపట్టి, న్యాయం చేయాల్సిందిగా బొబ్బిలి డిఎస్పీని ఆదేశించారు. ఎస్. కోటకు చెందిన శ్రీలక్ష్మి ఫిర్యాదు చేస్తూ తన భర్త, ఇతర కుటుంబ సభ్యులు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు, న్యాయం చేయాల్సిందిగా కోరారు.

ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ ఇరువురిని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపర్చి, న్యాయం చేయాల్సిందిగా మహిళా పిఎస్ డిఎస్పీని ఆదేశించారు. ఫిర్యాదుల విభాగానికి వచ్చే ఫిర్యాదులను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించి, వాటిపై తక్షణమే స్పందించాలని, వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను తనకు వెంటనే నివేదించాలని జిల్లా ఎస్పీ పాలరాజు పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ రామకృష్ణ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## తృతీయ ఫ్రంట్‌కు కార్యాచరణ ప్రారంభం

కేసీఆర్ దీనికి సంబంధించి కార్యాచరణ ప్రారంభించారు. కేసీఆర్ వెంట కె. కేశవరావు, కవిత, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ తదితరులు ఉన్నారు. మమతతో చర్చలు అనంతరం ఆయన సాయంత్రం కాళీమాత ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కేసీఆర్ బృందం హైదరాబాద్ బయలుదేరారు.

### ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై చర్చించా

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ్ బంగ సీఎం మమతా బెనర్జీతో ఆయన భేటీ ముగిసింది. సుమారు రెండు గంటల పాటు కొనసాగిన ఈ భేటీలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు సహా దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై చర్చించినట్టు చెప్పారు. ఇరువురు నేతలూ సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో తొలుత కేసీఆర్ మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు ఆవశ్యకతపై చర్చించామని స్పష్టంచేశారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో భాజపా, కాంగ్రెస్ విఫలమయ్యాయన్నారు. తమ ఫ్రంట్ చాలా పెద్దదని, ప్రజల ఎజెండాతో త్వరలోనే తమ కూటమి ముందుకొస్తుందన్నారు. దేశ రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు రావాల్సిన అవసరం ఉందని, రాజకీయాల్లో మార్పు విషయంలో ఈ సమావేశం ఓ తొలి అడుగు మాత్రమేనన్నారు. ఇందుకోసం చాలామంది మిత్రులు తమతో కలిసి వస్తారని ఆశిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో మాదే అతిపెద్ద కూటమిగా అవతరించబోతుందని, దేశ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తామని కేసీఆర్ అన్నారు. మమతతో జరిగిన చర్చల్లో కొన్ని అంశాలపై అంగీకారం కుదిరిందని, భవిష్యత్తులో మరిన్ని అంశాలపై స్పష్టత ఇస్తామని కేసీఆర్ చెప్పారు. ఇప్పటివరకు కాంగ్రెస్ లేదా భాజపా మాత్రమే పాలించిన దేశంలో ఏం మార్పు జరిగిందని ప్రశ్నించారు. ఫ్రంట్ ఏర్పాటుకు సంబంధించి తామిద్దరమే అన్ని అంశాలను నిర్ణయించలేమని, తమతో కలిసి వచ్చే మిత్రులందరితో చర్చించి మిగతా అంశాలు వెల్లడిస్తామని స్పష్టంచేశారు.

### పరిస్థితులే నాయకుల్ని సృష్టిస్తాయి

ఫ్రంట్ ఏర్పాటవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తంచేశారు. దేశంలో నెలకొన్న పరిస్థితులే నాయకులను సృష్టిస్తాయన్నారు. ఈ భేటీలో దేశాభివృద్ధి, రైతు సమస్యలపైనా చర్చించానన్నారు. భావసారూపత్య ఉన్న మిత్రులందరితోనూ చర్చలు జరుపుతామని చెప్పారు. దేశాభివృద్ధిపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించామని మమత అన్నారు.

## ఉభయ సభలు సమావేశం.. వాయిదా..

మంత్రి రాజ్‌నాథ్ లోక్‌సభలో స్పష్టం చేశారు. విపక్ష సభ్యులు ఆందోళన విరమించి సభ సక్రమంగా జరిగేందుకు సహకరించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

**రాజ్యసభకూడా వాయిదా..**

అటు రాజ్యసభలోనూ ఆందోళనలు కొనసాగాయి. వివిధ అంశాలపై విపక్ష పార్టీలు ఆందోళన చేయడంతో సభ ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ వెంకయ్యనాయుడు ప్రకటించారు.

## కోమటిరెడ్డి, సంపత్‌కు హైకోర్టులో వూరట

ఇవ్వొద్దని ఈసీని ఆదేశించింది. నల్గొండ, అలంపూర్ నియోజకవర్గాల ఎన్నికకు ఇప్పుడే నోటిఫికేషన్ ఇవ్వొద్దని స్పష్టంచేసింది. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా చోటుచేసుకున్న ఘటనల దృశ్యాలకు సంబంధించిన సీడీని ఈ నెల 22లోగా సీల్డ్ కవర్‌లో సమర్పించాలని అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది. అసెంబ్లీ కార్యదర్శి, శాసనసభ వ్యవహారాల శాఖ తరపున అడ్వకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు విన్పించారు. గవర్నర్ ప్రసంగం సభా వ్యవహారాల శాఖ కిందకే వస్తుందని ఏజీ వాదించారు. సభా గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించినప్పుడు సభ్యత్వం రద్దుచేసే అధికారం అసెంబ్లీకి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గతంలో సుప్రీం కోర్టు, పలు హైకోర్టులు అసెంబ్లీ అధికారాలను తేల్చి చెప్పాయని ఆయన వాదించారు. సభ్యుల అనుచిత ప్రవర్తన ఆధారంగానే అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని వివరించారు. ఈ ఘటనకు సంబంధించి తమ వద్ద ఉన్న దృశ్యాలను సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## భాజపా – వైకాపాలు కుమ్మక్కయ్యాయి

19 అంశాలు, పార్లమెంటు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. ఆంధ్రప్రదేశ్ పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయికి వచ్చేదాకా కేంద్రం చేయూతనివ్వాలి అని చంద్రబాబు డిమాండ్ చేశారు.

### ప్రత్యేక హోదా పెద్ద విషయమేం కాదు

తీసుకోలేదని.. ప్రభుత్వంలో జరుగుతోన్న అవినీతి ఆయనకు తెలుసునని చెప్పారు. దాదాపు 40 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వంలో అవినీతి జరుగుతున్నట్లు తనకు చెప్పారని.. తాను ముఖ్యమంత్రికి సమస్యను వివరించాలని వారు భావించారని.. తాను అదే చేశానన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపించాలంటూ డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టును ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగించడం వెనక కూడా ఏదో మతలబు ఉందని అనుమానం వ్యక్తం చేశారు.


**నా వెనక ప్రజలున్నారు..**

ప్రధాని నరేంద్రమోదీ చాలా దగ్గరిగా తెలుసునని పవన్ చెప్పారు. కానీ, తన పరిమితులు తనకున్నాయన్నారు. తన వ్యాఖ్యల వెనక భాజపా ఉందంటూ తెదేపా నేతలు మాట్లాడుతున్నారని.. ఆశ్చర్యకరంగా గతంలో తన వెనక చంద్రబాబు ఉన్నాడంటూ వైకాపా అధినేత జగన్ ఆరోపించారని గుర్తు చేశారు. వాస్తవానికి వారిద్దరూ చెప్పేది తప్పు అని.. తన వెనక ప్రజలు ఉన్నారంటూ చెప్పుకొచ్చారు.

భాజపాతో తమకు రాజీ కుదిరే అవకాశం లేదని పవన్ స్పష్టం చేశారు. ఏపీ ప్రజలు భాజపా తీరుపై చాలా ఆగ్రహంగా ఉన్నారు. వారు ఆ పార్టీని విశ్వసించడం లేదు. ప్రత్యేక హోదా డిమాండ్ కేవలం భావోద్వేగాలతో ముడిపడినదే కాదు అవసరం కూడా. బుందేల్‌ఖండ్‌లోని ప్రాంతాల మాదిరిగా ఏపీలోని ఏడు జిల్లాలు చాలా దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయి. ఈ జిల్లాల్లో పరిస్థితులు చక్కదిద్దాలంటే కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రావాల్సి ఉంది. రాష్ట్రానికి ప్రత్యేకహోదా అనే ట్యాగ్ ఇస్తారా? లేదా? అనేది ముఖ్యం కాదు. పేరు లేదా స్టేటస్ ముఖ్యం కాదు. కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందడమే అవసరం. మా డిమాండ్లు నెరవేరనంత వరకూ మేము భాజపాతో రాజీపడం. ప్రస్తుతం మేము సొంత దారిలో వెళ్తున్నాం. ఎన్నికల సమయంలో కూటమి అవసరమా లేక సొంతంగా పోటీ చేయాలా అనేది నిర్ణయిస్తాం. అని చెప్పారు.

కాంగ్రెస్, భాజపా వివిధ రాష్ట్రాల్లోని స్థానిక సమస్యలను అర్థం చేసుకోలేకపోయాయని ఆయన చెప్పారు. ఈ కారణంగానే థర్డ్ ఫ్రంట్ పురుడు పోసుకునే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. ప్రాంతీయ పార్టీలు సైతం జాతీయ సమస్యలపై ఆలోచించాలన్నారు. తాను ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశానని.. థర్డ్ ఫ్రంట్ గురించి ఆయనకు చెప్పానని చెప్పారు. ఇక ప్రభుత్వ పాలనలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, కేసీఆర్‌కు 10కి ఎన్నిపాయింట్లు ఇస్తారని ప్రశ్నించగా.. చంద్రబాబుకు 2.5 మార్కులు, కేసీఆర్‌కు 6 మార్కులు వేస్తానంటూ బదులిచ్చారు.

## భాజపాతో కలిసిన బాబువి మోసపూరిత వాగ్దానాలు



జంక్షన్, ఇసుకతోట తదితర ప్రాంతాలకు ధర్నాగా చేరుకుని మానవహారాలు నిర్వహించి రహదారుల దిగ్బంధనం చేశారు. విషయాన్ని ముందుగానే గ్రహించి పోలీసులు ముందుగా మోహరించి వైకాపా నేతలను అరెస్టు చేయడం జరిగింది. ఈ సంఘటనలో తైనాలకు గాయాలయ్యాయి. వైకాపా తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ బాబుకిన్నాళ్లకు బుద్ధివచ్చి తమ ఎంపీలను రాజీనామా చేయించి ప్రత్యేక హోదా సాధిస్తామన్నారు. కానీ కాషాయ నేతలు దానికి కూడా లేక్కచేయకపోవడంతో తప్పని సరి పరిస్థితుల నుండి ఎన్‌డిఏ కూటమినుంచి బయటకు రాకతప్పలేదు. చేతులుకాలిన తరువాత ఆకులు పట్టుకున్న చందాన .. తెలుగుదేశం పార్టీ ప్రవర్తన ప్రజలముందు అసహ్యించుకునే రీతిలో తయారయిందన్నారు. ఈ ధర్నా, మానవహారం కార్యక్రమంలో సత్తి రామకృష్ణా రెడ్డి, పక్కి దివాకర్, పసుపులేటి ఉషాకిరణ్, సనపల చంద్రమౌళి, బొడ్డేటి నాగు, హేమంత్, కోలా గురువులు , జాన్ వెస్లీ, దశమంతుల మాణిక్యాలరావు, శశికళ, పప్పల సునీత, గరికిన గౌరి, ముత్యం సూర్యారావు, తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరిడమ్మ జాతర ఏర్పాట్ల పై మంత్రి అయ్యన్న సమావేశం



నర్సీపట్నం: ఈ నెల 22 నుండి 30 వరకు మరిడి మహలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం ఏర్పాట్లపై సోమవారం రాష్ట రోడ్లు భవనాల శాఖా మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతరకు తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆయన అన్నారు. శాంతి భద్రతల పై కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసులకు సూచించారు. తాగు నీటి ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు సిసి కెమారాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నర్సీపట్నం ఏఎస్పీకి తెలిపారు. వైద్య సదుపాయాలు అంబులెన్స్ లు ఏర్పాటు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.రవాణా సౌకర్యాం ఏర్పాట్లను భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్టీసి అధికారులకు సూచించారు. శానిటేషన్ పరిశుభ్రత పై ప్రత్యేక ద అష్టి సారించాలని మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ సన్యాసిపాత్రుడు, ఏఎస్పీ ఆరిఫ్‌అఫీజ్, ఆర్డీవో సూర్యారావు, డిఎల్పీవో శిరీషరాణి, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరా ట్యాంకు ప్రారంభం

యలమంచిలి రూరల్: ప్రజల దాహార్తి తీర్చేందుకు తన వంతు సహకారం అందిస్తామని టీడీపీ నాయకులు సుందరపు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సుందరపు సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరా ట్యాంకును కూడా ప్రారంభించారు. తన సొంత ఖర్చులతో ట్యాంకును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లైను కొత్తూరు సర్పంచ్ లవుడు లోవరాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఛలో విజయవాడ జయప్రదం చేయండి

రావికమతం: గొర్రెల పెంపకదార్ల సమస్యలు పరిష్కారానికి ఈ నెల 22న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీరామ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు సమస్యలు పట్టించుకోవడం వల్ల ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టామన్నారు.

## ఏరియా ఆసుపత్రిలో రోగులు దాహం కేకలు



నర్సీపట్నం: ఏరియా ఆసుపత్రిలో మోటారు పాడవడంతో రోగులు దాహం కేకలు పెడుతున్నారు. విషయాన్ని గమనించి సూపరిండెంటెంట్ డాక్టర్ సుధాశారదా తక్షణ పరిష్కారానికి ఆదేశించారు. మోటారు రివైండింగ్ పని అవడం వలన ఒక్క రోజు సమయం పట్టిందని ఆమె తెలిపారు. మూడు రోజుల క్రితం మోటారు మరమ్మత్తులకు గురైంది. 2వ అంతస్తులో ఉన్నవారు మంచినీరు అందక ఆందోళన చెందారు. ప్రత్యామ్నాయం లేదు. వెంటనే సూపరిండెంటెంట్ దాన్ని మరమ్మత్తులు చేయించడానికి పూనుకున్నారు. ప్రస్తుతం ఇబ్బంది లేదని రోగులు తెలియజేశారు.



***ప్రస్తుతం సమస్య పరిష్కారమైంది***

మోటారు పాడైన మాట వాస్తవమే. తక్ష ణమే రిపేరు చేయించాను. వైండింగ్ ఆవడం వలన ఒక రోజు ఇబ్బంది తలెత్తింది. ప్రస్తుతం సమస్య పరిష్కారమైందని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సుధాశారదా తెలిపారు.

# నక్కవానిపాలెం 60 అడుగుల రోడ్డు సత్వరం పూర్తి చేయండి

14వ వార్డులో క్షేత్ర పర్యటన - రోడ్ మార్జిన్లు, బెర్మ్ ఎడ్జిలను శుభ్రం చేయండి

డ్రెయిన్లు, రోడ్లను మరమ్మతు చేయండి - త్రాగునీరు కలుషితం కాకుండా పర్యవేక్షించండి

కె.ఆర్.యం కాలనీ, చైతన్యనగర్, క్రాంతినగర్‌లలో పర్యటన

జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం:- జివియంసి రెండవ జోన్ 14వ వార్డు లో సోమవారం కమిషనర్ హరినారాయణన్ పర్యటించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద కళ్యాణ మండపం నుండి కె.ఆర్.యం కాలనీ, నక్కవానిపాలెం లలో పర్యటించి పలు సూచనలు చేశారు. డంపర్‌బిన్ల చుట్టూ పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్ మార్జిన్లు, బెర్మ ఎడ్జిలను శుభ్రం చేయాలని పేర్కొన్నారు. త్రాగునీటి పైపులు నక్కవానిపాలెంలో లీకవుతున్నందున వెంటనే పరిశీలించి త్రాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు. యుజిడి పైపులు, త్రాగునీటి పైపులు లీక్ కాకుండా పర్యవేక్షించాలని, లీకయ్యేటట్లు కన్పిస్తే తక్షణం పైపులను మార్చి త్రాగునీరు కలుషితం కాకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

తొలుత నక్కవానిపాలెం, క్రాంతినగర్, 6, 5 వీధులలో పర్యటించారు. 60 అడుగుల రహదారి విస్తరణ పనులకు ఆటంకాలు తొలగినందున తక్షణం రహదారి నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారికి అడ్డంగానున్న మరమ్మత్తు కార్లు, బడ్డీలు తొలగించి రహదారి నిర్మాణానికి దోహదపడాలని కోరారు.

పర్యటనలో రెండవజోనల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇ.ఇ వెంకటి, ఎసిపి నాయుడు, శానిటరీ సూపర్‌వైజర్ రమణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు, ఎలక్ట్రికల్ ఏ.ఇ నాయుడు, పబ్లిక్‌వర్క్స్ ఏఇ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## లేటరైట్ లారీలు అడ్డగింత



నాతవరం: నాతవరం మండల కేంద్రంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఉమాశంకరగణేష్ ఆధ్వర్యంలో సోమవారం లారీలను అడ్డుకున్నారు. ఎస్సై సత్యనారాయణ అక్కడకు వచ్చి లేటరైట్ యాజమాన్యం, వైసిపి నాయకులు, గ్రామ ప్రజలకు మధ్య సమన్వయం ఏర్పాటు చేశారు. దీంతో లేటరైట్ యాజమాన్యం ఏప్రిల్ 1 నుంచి లారీలను నిలిపివేస్తామని హామీ ఇవ్వడంతో వీరు శాంతించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అంకంరెడ్డి జమీలు, సీనియర్ నాయకులు పైల పోతురాజు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన వైసిపి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 26న సీతారాముల కల్యాణం

రావికమతం: రావికమతం కోదండ రామాలయంలో సీతారామ కళ్యాణానికి ఆలయ పురోహితుడు గిరిబాబు ఆధ్వర్యంలో గ్రామస్థులు పెళ్లి రాట చేసే కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ఈ నెల 26న గెంజి ఆరి ఆలయంలో జరిగే సీతారామ కల్యాణానికి ఎటువంటి విఘ్నాలు ఎదురుకాకుండా ఉండాలని ఆలయ ఆవరణలో ఉగాది రోజున పెళ్లి రాట వేశామన్నారు.అనంతరం గ్రామానికి చెందిన దేవత నరసింగరావు, చిట్టి మణి దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు.

## పూర్వవిద్యార్థి ఔదార్యం

ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరానికి విరాళం



ఆంధ్రవిశ్వవిద్యాలయం: ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఒక గదిని పూర్తిస్థాయిలో ఆధునీకరించి అందించారు. ఆర్కిటెక్చర్ విభాగం పూర్వ విద్యార్థి కె.సురేష్ తన సొంత నిధులతో దీనిని తయారు చేసి వర్సిటీకి అందజేశారు. ముగ్గురికి వసతి కల్పించే విధంగా స్టోర్ రూమ్‌ను పూర్తిస్థాయిలో ఆధునిక సొబగులు అద్దుతూ తీర్చిదిద్ది వర్సిటీకి అందించారు. ఆదివారం వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు ప్రారంభించారు. అనంతరం గదిని ఆధునీకరించి అందించిన సురేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్ అవధాని, ప్లాటినం జూబ్లీగెస్ట్‌హౌస్ డీన్ ఆచార్య కె.రఘు బాబు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు యువత అర్థిక సహాయంతో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు



పరవాడ: పరవాడ మండలము గోర్లివానిపాలెం గ్రామం అరాద్యదేవతైన బంగారుమాంబ పండుగను పురష్కరించుకోని తెలుగు యువత అద్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలును నిర్వహిస్తున్నామని పరవాడ మండల తెలుగు యువత అద్యక్షులు గొర్లి గోపి తెలిపారు.అయన సోమవారము తనస్వగ్రహంలో విజయబాను ప్రతినిదితో మాట్లడుతూ ఈ నెల ఇరవై రెండోవ తేదిన తెలుగు యువత అర్దిక సహయంతో జిల్లా స్దాయి క్రికెట్ పోటీలును నిర్వహిస్తున్నామని ఆసక్తిగల వారు ఏవరైన ఉంటే శివ, పోన్ నెంబర్ 8328428320, రాజు, పోన్ నెంబర్ 9949217436, మరియు నాగరాజు. పోన్ నెంబర్ 9989154805 నిర్వహకులుని సంప్రదించాలని అయన కోరారు. ఈ పోటీల్లో గెలిపోందిన విజేతలుకు మొదటి బహుమతి పదిహేను వేలు, రెండోవ బహుమతి పది వేలు, మూడోవ బహుమతి ఐదు వేలు చొప్పున అందజేస్తామని తెలుగు యువత అద్యక్షులు గోపి తెలిపారు.

# అప్పన్నకు 5 కేజీల ముత్యాల తలంబ్రాలు విరాళం



సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారికి ఈ నెల 27 న జరగనున్న కల్యాణ మహోత్సవంలో వినియోగించనున్న తలంబ్రాల కొరకు 5 కేజీల ముత్యాలను విశాఖపట్నానికి చెందిన విజయలక్ష్మి డైమండ్స్ అధినేత వి .శివశంకర్ రాజు నేడు సింహగిరిపై దేవస్థాన ఆలయ ఏ ఈ ఓ ఆర్.వి.ఎస్. ప్రసాద్ అందజేసినారు. ఈ ముత్యాలను స్వామి వారికి జరగనున్న కళ్యాణ మహొత్సవంలో తలంబ్రాలుగా వినియోగించనున్నారు.

## డయల్ యువర్ కమిషనర్‌కు 6 ఫిర్యాదులు



విశాఖపట్నం : జి.వి.యం.సి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800-4250-0009) కార్యక్రమానికి ఆరు ఫిర్యాదులు అందాయి. అదనపు కమిషనర్ (ఫైనాన్స్) ఎస్ ఎస్ వర్మ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి హాజరై పలువురి నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఇందులో రెండవ జోన్‌కు సంబంధించి ఒకటి, మూడవ జోన్‌కు సంబంధించి ఒకటి, నాలుగవ జోన్‌కు మూడు, ఐదవ జోన్‌కు సంబంధించి ఒకటి ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడురోజులులోగా నివేదిక సమర్పించాలని కోరారు.

## హోమంత్రిని కలిసిన బుద్ధ



అనకాపల్లి : రాష్ట్ర హోంశాఖా మంత్రి నిమ్మకాయల చినరాజప్పన్న ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా తెలుగు దేశం పార్టీ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వ రరావు తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలో మంత్రి నివాసానికి వెళ్లి ఉగాది శుబాకాంక్షలు తెలిపి సత్కరించారు.

## జివిఎంసి గ్రీవెన్సుకు 128 ఫిర్యాదులు



విశాఖపట్నం :- జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్సుడేలో మొత్తం 128 ఫిర్యాదులు అందాయి. అదనపు కమిషనర్ (జనరల్) జివివియస్ మూర్తి ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందిన మొత్తం 128 పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 42 ఫిర్యాదులు అందాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంకు సంబంధించి 28, ప్రజారోగ్యవిభాగానికి సంబంధించి 9, ప్రధానఇంజనీరు విభాగా నికి సంబంధించి 46, సిటీ వెటర్నరీ విభాగానికి సంబంధించి ఒకటి, యుసిడి విబాగానికి సంబంధించి ఒకటి, హార్టికల్చర్ విభాగానికి సంబంధించి రెండు, అదనపు కమిషనర్ (జనరల్) విభాగంకు సంబంధించి నాలుగు, డిప్యూటి కమిషనర్ రెవిన్యూ విభాగంకు 29, ఇతరులకు సంబంధించి 9 పిర్యాదులు అందాయి.

## కొణతాలను కలిసిన పలువురు ప్రముఖులు




అనకాపల్లి : పట్టణంలోనే రింగ్‌రోడ్‌లో ఉన్న కొణతాల క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ చేపట్టిన దీక్షకు పలువురు సంఘీభావం ప్రకటించారు.

ప్రత్యేక హెూదా అమలు చేయాలని, విభజన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆదివారం చేపట్టిన ఉపవాస దీక్షకు జిల్లా నలుమూలల నుండి అనేక మంది విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. సోమవారం ఉదయం వరకు ఈ దీక్ష కొనసాగింది.

కొణతాలకు సంఘీభావం తెలిపిన వారిలో సిపిఐ నాయకులు సత్యనారా యణమూర్తి, చీడికాడ జెడ్పీటీసీ వరలక్ష్మి, పివిజికుమార్, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బాబ్జీ, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అయ్యార్ గంగాధర్, యుూజిఎఫ్ అధ్యక్షులు వర్మ, సిపిఎం నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

## సదరం సర్టిఫికేట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పీలా



అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో దివ్యాంగులకు సదరం సర్టిఫికేట్లు పంపిణీ చేసారు. సుమారు 200 మందికి దివ్యాంగులకు ఎమ్మెల్యే పీలా ఈ సదరం సర్టిఫికెట్లను అందజేసారు. ఎమ్మెల్యే పీలా మాట్లాడుతూ వీరికి త్వరలో ఫించన్లుకు ధరఖాస్తు చేసి, మంజూరు చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్‌ఈసిఎస్ చైర్మన్ మలసాల రమణరావు, టీడీపీ నాయకులు బొలిశెట్టి శ్రీను, ఆసపత్రి సూపరిడెంట్ జగన్మోహనరావు, మండల అధ్యక్షుడు పచ్చికూర రాము, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌కార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

రోలుగుంట : గ్రామాల్లో అర్హులైన వారు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పెంటకోట అప్పలనాయుడు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కుటుంబ సభ్యులతో ఉన్న కార్డు పేర్లు తొలగించుకున్న తర్వాతే కొత్త కార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో జరిగిన జన్మభూమి సభల్లో చాలా మంది పాతకార్డుల్లో పేర్లు తొలగించకుండా దరఖాస్తు చేసుకోవడం వల్ల కొత్త కార్డులు మంజూరు కాలేదని చెప్పారు.

## దగ్ధమైన తోటల్లో మొక్కలు నాటేందుకు చర్యలు

కొయ్యూరు : తోటలు కాలిపోయిన రైతులందరికీ మొక్కలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపిడిఒ ఇమ్మానియేల్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కొండ భాగంలో ఎండిన ఆకులకు ఎవరో నిప్పు పెట్టడంతోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు.

ఈ మేరకు ఆయా రైతుల వివరాలు సేకరించి పాడేరు ఐటిడిఎ పిఒకు అందజేస్తామని తెలిపారు.

# విజయభాను సంపాదకీయం

## బాలల భద్రత?

బాలల భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని కూడా ధరంపూర్ దుర్ఘటన సూచిస్తున్నది. మన దేశంలో ప్రతి రోజు 43 మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారనేది దిగ్భ్రాంతికరమైన విషయం. పిల్లల భద్రతకు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలను మన దేశంలో పాటించడమే లేదు. పిల్లలను బడికి, ఇంటికి సురక్షితంగా తరలించే విషయమై కఠిన నిబంధనలను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలె. పాఠశాల బస్సులు, డ్రైవర్లకు సంబంధించి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలె. ఎక్కడ ప్రమాదాలకు అవకాశం ఉన్నదో గుర్తించి చర్యలు తీసుకోవాలె. తల్లిదండ్రులకు కూడా భద్రతా సూత్రాలను బోధించి చైతన్యపరుచాలె. బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లా మీనాపూర్‌లో కారు ఢీకొని తొమ్మిదిమంది బడిపిల్లలు మరణించడం అత్యంత దారుణం. ఈ దుర్ఘటనలో మరో పన్నెండు మంది పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మొత్తం ఉదంతం రాజకీయవ్యవస్థ ఎంత మొద్దుబారిపోయి ఉన్నదో వెల్లడిస్తున్నది. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన వారిని దవాఖానకు తరలించడం వాహనం నడిపేవారి బాధ్యత. కానీ వాహనాన్ని నడుపుతున్న బీజేపీ నేత మనోజ్ బైతా ప్రమాదం సృష్టించిన బీభత్సాన్ని పట్టించుకోకుండా వెళ్ళిపోయాడు. బడిపిల్లలు ఉండేచోట వాహనాన్ని జాగ్రత్తగా నడుపాలనే కనీస అవగాహన ఉన్నా ఈ ప్రమాదం జరుగకపోయేది. ఈ ఉదంతంలో బీహార్ ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం వ్యవహరించిన తీరు కూడా బాధ్యతారహితంగా ఉన్నది. తమ పార్టీ నాయకుడే ప్రమాదకారకుడని మొదటే అంగీకరించి చర్య తీసుకుంటే హుందాగా ఉండేది. కానీ మొదట్లో ప్రమాదకారకులు ఎవరో తెలువలేదు. వాహనంపై ఉన్న బీజేపీ గుర్తు మూలంగా ఆ పార్టీ నాయకుడనేది మొదట వెల్లడైంది. ఆ తరువాత ఆ వాహనం యజమాని మనోజ్ బైతా అనేది వెల్లడైంది. అయినా అతడిని పోలీసులు అరెస్టు చేయలేదు. బీజేపీ నాయకులు బైతా తమ పార్టీకి సంబంధించిన వ్యక్తి కాదని బుకాయించారు. బైతా వాహనంలో ఉన్నాడా లేడా అనే సందిగ్ధం నెలకొన్నది. కానీ సీసీటీవీ దృశ్యాల ఆధారంగా బైతా స్వయంగా వాహనం నడుపుతున్నాడని వెల్లడైంది. ప్రజాభిప్రాయం వ్యతిరేకంగా మారుతుండటంతో బీజేపీ నాయకులు బైతా ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించక తప్పలేదు. బైతా స్వయంగా వచ్చి లొంగిపోయే వరకు పోలీసులు అతడిని అరెస్టు చేయనే లేదు. బైతా వాహనం నడుపుతున్నప్పుడు మద్యం సేవించి ఉన్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీహార్‌లో మద్య నిషేధం అమలులో ఉన్నందున ఈ ఆరోపణలకు మరింత ప్రాధాన్యం ఏర్పడ్డది. బీహార్‌లో జేడీయూ- బీజేపీ కూటమి అధికారంలో ఉన్నందున బైతాను పోలీసులు వెంటనే అరెస్టు చేయలేదనే ఆరోపణలకు బలం చేకూరుతున్నది. ధరంపూర్‌లో జరిగిన ప్రమాదానికి అధికార యంత్రాంగం కూడా బాధ్యత వహించక తప్పదు. ఈ సర్కారు బడి 77వ నెంబరు జాతీయ రహదారికి యాభై మీటర్ల దూరంలోనే ఉన్నది. పిల్లలు ప్రతిరోజు బడికి వెళ్ళిరావాలంటే, ఈ రహదారి దాటాల్సిందే. దగ్గర్లోనే అతివేగంగా వాహనాలు తిరుగాడుతుంటాయి. బడిని అక్కడి నుంచి వేరే చోటికి మార్చాలని పేద తల్లిదండ్రులు ఎంతో కాలంగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కానీ అధికార యంత్రాంగం పట్టించుకో లేదు. ఏదో ఒక రోజున ఘోర ప్రమాదం జరుగవచ్చునని తల్లిదండ్రులు భయపడుతూనే ఉన్నారు. ఇప్పుడు ఆ ఘోరం జరిగిపోయింది. అందుకే ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు ఆగ్రహంతో జాతీయ రహదారిపై రాకపోకలను అడ్డుకున్నారు. ప్రమాదంలో పిల్లలు మరణించిన వెంటనే ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి నాలుగేసి లక్షల రూపాయల పరిహారాన్ని ప్రకటించింది. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించింది. కానీ ప్రభుత్వ యంత్రాంగం ముందే తల్లిదండ్రుల విజ్ఞప్తిని ఆమోదించి, బడిని వేరేచోటికి తరలించినట్టయితే పిల్లల ప్రాణాలు పోకపోయేవి. ఎంతో ఒత్తిడి వస్తే తప్ప స్పందించలేనంతగా ప్రభుత్వ యంత్రాంగం మొద్దుబారిపోయి ఉన్నది. ఇటీవలనే ఒక రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట అనేకమంది ప్రాణాలను హరించింది. పాతకాలపు ఈ ఒక్క వంతెన సరిపోవడం లేదని మరిన్ని నిర్మించాలని ఎంతో కాలంగా ప్రయాణికులు కోరుతున్నా పట్టించుకొనేవారు లేరు. ఒక దుర్ఘటన జరిగిన కొందరు బలైతే కానీ అధికార యంత్రాంగంలో చలనం రావడంలేదు. ఇది పాలనా సంస్కృతికి సంబంధించిన అంశం. ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా, చురుకుగా ఉంటే అనేక సమస్యలు అతి సులభంగా పరిష్కారమైపోతాయి. బాలల భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని కూడా ధరంపూర్ దుర్ఘటన సూచిస్తున్నది. మన దేశంలో ప్రతి రోజు 43 మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారనేది దిగ్భ్రాంతికరమైన విషయం. పిల్లల భద్రతకు సంబంధించి సూచనలను మన దేశంలో పాటించడమే లేదు.

# పేదలకు బట్టలు, బియ్యం పంపిణీ



పెదగంట్యాడ: అగనంపూడి, లంకెల పాలెం శిష్ఠ కరణం అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సం. ఉగాది పర్వదినం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా ఉగాది సందర్భంగా అనేక కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ముగింపురోజైన సోమవారం నిరుపేదలకు అవసరమగు బియ్యం, నిత్యవసర వస్తువులు, ఒకనెలకు సరిపడా 9 కుటుంబాలకు అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫిలిం డైరెక్టర్ దుగ్గివలస దివాకర్ పాల్గొని మాట్లాడుతూ ట్రస్టు చేస్తున్న సేవలను కొనియాడారు. పేదలకు నిత్యవసర వస్తువులతోపాటు, పేదవిధ్యార్థులకు పుస్తకాలను అందించి వారి ఉన్నతికి తోడ్పడం అభినందనీయమని ట్రస్టును కొనియాడారు. అంతే కాకుండా తన వంతు సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. ట్రస్టు అధ్యక్షులు డియన్ఎస్ ప్రసాద్ అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అగనంపూడి, స్టీల్ ప్లాంట్, గాజు వాక, అనకాపల్లి, యలమించిలి, అసోసి యోషన్ అధ్య క్షులు కార్యదర్శిలు, లైన్స్‌క్లబ్ ప్రతినిధులు బి.వి.ఎస్. సుబ్రమణ్యం, కె.వి.ఎన్‌మూర్తి, యం. త్రినాథ రావు, యం.జగన్నాథం, సత్యన్నారాయణ, సైకాలజిస్టు కుమారి అనిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలపై వైకాపా అలుపెరగని పోరాటం



గాజువాక: రాష్ట్ర ప్రజల ఎదుర్కోంటున్న ప్రజా సమస్యలపై వైకాపా అలుపెరగని పోరాటం చేస్తుందని గాజువాక వైకాపా సమన్వయ కర్త తిప్పల నాగిరెడ్డి పేర్కోన్నారు. సోమవారం గాజువాక ప్రధాన కూడలి వద్ద అధిస్థానం ఆదేశాల మేరకు ప్రజా సంకల్ప మానవహారం చేసారు. ఈ సందర్భంగా వైకాపా సమన్వయ కర్త తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర ప్రజల తరపున ప్రత్యేక హెూదాకొసం వైకాపా పోరాటం చేస్తుందని, తమ నాయకుడు వైయస్ జగన్ ప్రత్యేక హెూదా వచ్చేవరకు పోరాటం చేస్తారని అన్నారు. యువతకు ఉపాది కల్పిస్తామని, రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామని, అందుకు కేంద్రం అనుకూలంగా ఉందని తెదేపా ప్రభుత్వం మాయ మాటలు చెప్పి 4సం. గడిపి ఇప్పుడు సిగ్గు లేకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంపై వ్యతిరేకతను వ్యక్తం చేయడం గుంటనక్కను తలపిస్తుందని అన్నారు. వైకాపా ప్రజా సమస్యలపై నిరహారదీక్షలు, యువభేరి, కలెక్టర్ కార్యాలయం ముట్టడి తదితర అనేక ఉద్యమాలు నిర్వహించడం జరిగిందని అన్నారు. రానున్నది వైకాపా కాలమని, తప్పక రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని అప్పుడు నిరుపేదల కష్టాలు తీరుతాయని ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. రాష్టానికి ప్రత్యేక హెూదా కోసం పార్లమెంటులో తెదేపా యం.పిలు ఉద్యమాలు చేస్తున్నారని, అవిశ్వాస తీర్మానంనకు నోటీసులిచ్చి సమస్యను ప్రక్కదోవ పట్టించేవిధంగా తెదేపా యం.పిలు డ్రామాలాడుతున్నారని విమర్శించారు. కాని ఇదంతా రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని రానున్న రోజులలో తెదేపాకు రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు మార్డుపూడిపరదేశి, ఎన్నేటి రమణ, ఉరుకూటి అప్పారావు, కొయ్యభారతీ, వై.మస్తానప్ప, పూడిపరదేశి, రెడ్డిజగన్నాథం, రాజాన వెంకటరావు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నితీష్‌పై అనర్హత పిల్ కొట్టివేత..



న్యూఢిల్లీ: బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తనపై హత్య కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని నితీష్ ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టారని, ఇందువల్ల తక్షణమే ఎమ్మెల్సీ సభ్యత్వానికి ఆయనను అనర్హుడుగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని 2012లో ఎన్నికల సంఘానికి నితీష్ తెలియజేసినట్టు ఆయన తరపు న్యాయవాది కోర్టుకు సమాచారమిచ్చారని, ఆరీత్యా పిల్ విచారణయోగ్యం కాదని భావించి కొట్టివేస్తున్నట్టు భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా సారథ్యంలోని బెంచ్ పేర్కొంది. జస్టిస్ ఎఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్ ఈ బెంచ్‌లో ఉన్నారు. నితీష్‌పై ఉన్న కేసుపై పాట్నా హైకోర్టు స్టే ఇచ్చిందని, అంతేగాక నితీష్ ఎలాంటి చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడలేదని ఆయన తరపు న్యాయవాది అత్యున్నత న్యాయస్థానానికి విన్నవించారు. నితీష్‌పై అడ్వకేట్ ఎంఎల్ శర్మ పిల్ వేశారు. 1991లో బర్హ్ లోక్‌సభ ఉపఎన్నిక ముందు జేడీయూ నేత నితీష్‌పై క్రిమినల్ కేసు నమోదైందని, స్థానిక కాంగ్రెస్ నేత హత్య, మరో నలుగురి గాయపరిచిన కేసులో ఆయన నిందితుడని పిల్‌లో ఆరోపించారు. అభ్యర్థులు నామినేషన్ పేపర్లు దాఖలు చేసేటప్పుడు తమపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని అఫిడవిట్ తప్పనిసరిగా సమర్పించాలని ఎన్నికల కమిషన్ 2002లో ఒక ఉత్తర్వు జారీ చేసిందన్నారు. అయితే నితీష్ 2012లో మినహా 2004 నుంచి తనపై ఉన్న పెండింగ్ కేసు గురించి ఎలాంటి అఫిడవిట్లు దాఖలు చేయలేదని ఆ పిల్‌లో న్యాయవాది శర్మ పేర్కొన్నారు.

# సమకవి సమయం

## ఇది "తెలుసు"నా..!

తెలుసుకున్నంత మాత్రాన అన్నీ
చేయలేవు
తెలియకపోయినంత మాత్రాన
చేయకుండా ఆగలేవు
అంతా తెలిసి ఉండడం మంచిదే
కొన్ని తెలిసియుండకపోవడమూ
మంచిదే
అన్నీ తెలుసు అనే గర్వం వద్దు
ఏమీ తెలియని అజ్ఞానం వద్దు
తెలుసుకుంటే సరిపోదు
బహుళ సాధన చేయాలి
తెలియకపోయినా ఫరవాలేదు
మరలా అడిగి తెలుసుకో
ఎటు వెళ్లాలో తెలిస్తే మంచిది
ఎటు వెళ్లకూడదో తెలిస్తే మరీ
మంచిది
తెలుసుకున్న మంచి విషయాలు
జీవితాంతం గుర్తు పెట్టుకో
తెలుసుకున్న చెడ్డ విషయాలు వెంటనే
మర్చిపో
నిత్య సత్యాలు తెలుసుకోవడం
నీకుపకారం
ఆ సత్యాన్ని పదిమందితో
పంచుకోవడం పరోపకారం
తెలిసి తెలియదని నటించే వాళ్లూ
ఉన్నారు
తెలియకపోయినా తెలుసునని
భ్రమించే వాళ్లూ ఉన్నారు

- పి. శాంతికుమార్

# పంచాంగం

మాసం : ఛైత్ర; తిథి: తదియ సా.5.03; అశ్విని రా.8.04; సా.వ.4.06ల 5.41; తె.వ.5.25ల

మంగళవారం 20-03-2018

a **మేషం** : మీ యత్నాలు కొంత ఆలస్యంగానైనా పరిపూర్ణంగా పూర్తవుతాయి. నూతన పెట్టుబడులు, వ్యాపారాలకు అనుకూలం. చేపట్టిన పనుల్లో శ్రమాధిక్యత, ప్రయాసలు ఎదుర్కొంటారు. అవివాహితులకు శుభవార్తలు అందుతాయి. ఉద్యోగస్తులకు రావలసిన ప్రమోషన్‌లో స్వల్ప ఆటంకాలు ఎదురవుతాయి. నిరుద్యోగులు, చేతి వృత్తుల వారికి ఆశాజనకం.b **వృషభం** : పండ్లు, పూలు, కొబ్బరి, చిరు వ్యాపారులకు లాభదాయకం. ఖర్చు పెరగటంతో రుణ యత్నాలు, చేబదుళ్ళు తప్పవు. విద్యార్థులకు ఒత్తిడి, మెలకువ ఆందోళన కలిగిస్తాయి. ఇతరులకు పెద్ద మొత్తాలలో ధన సహాయం చేసే విషయంలో లౌక్యం ఎంతో అవసరం. మిత్రుల ద్వారా అందిన ఒక సమాచారం మీకు ఆందోళన కలిగిస్తుంది.c **మిథునం:** ఉద్యోగస్తులకు ఒత్తిడి, పనిభారం అధికం. ఏజెన్సీ, నూతన కాంట్రాక్టుల విషయంలో పునరాలోచన అవసరం. రాజకీయ నాయకులు సభ, సమావేశాలలో చురుకుగా వ్యవహరిస్తారు. ఆత్మీయుల కలయిక సంతోషం కలిగిస్తుంది. వ్యాపారాభివృద్ధికై చేసే కృషిలో రాణిస్తారు. రావలసిన ధనం అందటంతో మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. d **కర్కాటకం** :ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. పారిశ్రామిక రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచివి కావని గమనించండి. స్త్రీలు షాపింగ్ వ్యవహారాలు, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత అవసరం.e **సింహం** : నిరుద్యోగులు శుభవార్తలు వింటారు. పారిశ్రామిక రంగాల వారికి కార్మికులతో సత్సంబంధాలు నెలకొంటాయి. క్యాటరింగ్ పనివారలు, చేతివృత్తుల వారికి ఆశాజనకం. తరచూ వేడుకలు, శుభకార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్యంలో తగు జాగ్రత్తలు అవసరం. ఖర్చులు, చెల్లింపుల్లో ఏకాగ్రత వహించండి. విద్యార్థులలో ఏకాగ్రత, పట్టుదల అవసరంf **కన్య** : బంధువులతో తెగిపోయిన సంబంధాలు బలపడతాయి. మీ కార్యక్రమాలు, పనులు వాయిదా వేసుకోవలసి వస్తుంది. స్త్రీలతో మితంగా సంభాషించండి. గృహంలో ఒక శుభకార్యం సమర్థంగా నిర్వహిస్తారు. ఉన్నతస్థాయి ఉద్యోగస్తులకు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత అవసరం. కోర్టు వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి.g **తుల** : కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లు, ప్లీడరు గుమాస్తాలకు ఊహించని చికాకులు ఎదురవుతాయి. ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. వ్యాపారాలకు కొత్త కొత్త పథకాలు, ప్రణాళికలు రూపొందిస్తారు. దంపతుల మధ్య పలు ఆలోచనలు చోటు చేసుకుంటాయి. రాబడికి మించిన ఖర్చులుంటాయి. ధనవ్యయంలో ఏకాగ్రత వహించండి.h **వృశ్చికం** : రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ సంకల్పం నెరవేరుతుంది. స్త్రీలు గృహాలంకరణ, విలాస వస్తువుల పట్ల ఆసక్తి కనబరుస్తారు. తలపెట్టిన పనులు నిర్విఘ్నంగా పూర్తి కాగలవు. ఆస్తి వ్యవహారాలలో సోదరులతో ఒప్పందాలు కుదుర్చుకుంటారు. బంధువుల నుంచి ముఖ్యమైన సమాచారాన్ని అందుకుంటారు. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో లౌక్యం అవసరం.i **ధనుస్సు** :హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. కొంతమంది మీ ఆలోచనలను నీరుగార్చేందుకు యత్నిస్తారు. లీజు, ఏజెన్సీలు, నూతన టెండర్లు అనుకూలిస్తాయి. శ్రమాధిక్యత, అకాల భోజనం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. ఉద్యోగస్తులకు తోటివారి నుంచి ఆహ్వానాలు అందుతాయి. ఏవైనా చిన్న చిన్న సమస్యలు తలెత్తినా నెమ్మదిగా సమసిపోతాయి.j**మకరం** : మీలోని బలహీనతలను తొలగించుకోవటంపై దృష్టి పెడతారు. ఆర్థిక విషయాలలో పురోభివృద్ధి. బ్యాంకు రుణాలు అందుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. కొన్ని సందర్భాలలో రిస్క్ తీసుకోవాల్సి వచ్చినా చివరికి మంచే జరుగుతుంది. చివరికి విజయం మీ సొంతం.k **కుంభం** :విద్యార్థులు ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి. కోర్టు వ్యవహారాలు అనుకూలిస్తాయి. ప్రేమికులకు ఎడబాటు, ఊహించని చికాకులు ఎదుర్కోవలసి వస్తుంది. విదేశాల్లో ఉంటున్న ఆత్మీయుల క్షేమ సమాచారాలు సంతృప్తినిస్తాయి. అవివాహితులకు అనుకున్న సంబంధం కుదరడంతో ఉత్సాహంగా ఉంటారు.L **మీనం** : చేపట్టిన పనులు కొంత ఆలస్యంగానైనా అనుకున్న రీతిలో పూర్తి చేస్తారు. ప్రముఖులతో పరి చయాలు లాభిస్తాయి. వస్త్ర, బంగారం, ఫ్యాన్సీ, పచారీ వ్యాపారులకు పురోభివృద్ధి. తరచూ వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు.

# పరమేశ్వరుడు మంగళ స్వరూపుడు

## సంకీర్తన

ఆయన ఆదిదేవుడు.. ఆది మధ్యాంత రహితుడు... అడిగినవారికి, అడిగినంత ఇచ్చే బోళాశంకరుడు. తాను గరళాన్ని మింగి, లోకాలకు అమృతాన్నిచ్చిన మహోదారుడు శంకరుడు. తాను శ్మశానవాసిగా భిక్షాటన చేస్తూ, భక్తులకు సకలైశ్వరముల నిచ్చే భక్తజన సులభుడు పరమశివుడు.అసలు 'శివం' అంటేనే 'మంగళం' లేక ''కల్యాణం అని అర్థం. పరమేశ్వరుడు మంగళస్వరూపుడు.

**శివ - అంటే పరమేశ్వరుడు.**

శివా - అంటే పార్వతి. ఇలా అయ్యవారిలోనే అమ్మవారు ఉంది. 'శివపురాణం'లోని లింగోద్భవ కథ అందరికీ తెలిసిందే. శివుడు ప్రథమంగా లింగరూపిగా వెలసిన సందర్భం - హరిబ్రహ్మల వివాద సందర్భంలో ఆ రోజు ఒకానొక మాఘమాసంలో కృష్ణ చతుర్దశి రోజు. అర్థరాత్రి వేళ! బ్రహ్మదేవుడు, విష్ణుమూర్తి తమ తమ గొప్పదనాలను గురించి వాదులాడు కుంటున్న సమయం. సృష్టిస్థితి, కారకులైన వాపరిద్దరూ అలా వాదులాడుకోవడం, వారిపై ఆవరించి యున్న 'మాయ'కు సంకేతం. ఆ మాయను తొలగించేందుకు 'మాయి' అయిన మహేశ్వరుడు పూనుకోక తప్పలేదు. పరస్పర ఆధిక్యతను నిరూపించుకునేందుకు బ్రహ్మాస్త్ర వైష్ణవాస్త్రాలు విజృంభించినప్పుడు, ఆ ఇద్దరి నడుమన ఆదిశంకరుడు అఖండాగ్ని స్తంభంగా ఆవిర్భవించాడు. మాఘకృష్ణ చతుర్దశ్యామాది దేవో మహానిశి

శివలింగ తయోద్భూత: కోటి సూర్య సమప్రభ.

కోటి సూర్యలకు సమానమైన ప్రకాశంగల ఆ మహాలింగం ఆవిర్భావం జరిగిన రోజే మహాశివరాత్రి. ఆ మహాగ్ని స్తంభానికి ఆది, అంతం లేదు. ఆ లింగ స్వరూపం నిర్గుణ పరతత్త్వ స్వరూపం. ఆయన శుభాలనొసగేవాడు. లోక కల్యాణమూర్తి. తనను ప్రార్థించినవారికి కొంగు బంగారం. తనను ఎలా పూజించినా సరే, కేవలం 'భక్తి'కి మాత్రమే ప్రాధాన్యతనిచ్చే అభయంకరుడు శంకరుడు. ఆ మహేశ్వరుని విభూది ధరించని నుదురు, ఈశ్వరార్చన చేయని జన్మం, శివాలయ లేని గ్రామం, శివ సంబంధం లేని విద్య, అత్యంత నీచములు, నింద్యములని జాబాలోపనిషత్తు చెబుతోంది. అందుకే సాధారణంగా మన దేసంలో శివాలయం లేని ఊరుండదు. శివాలయం లేని ఊరు స్మశానంతో సమానం.



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# ఫలప్రదంగా విళంబి నామ సంవత్సరం

## - ప్రముఖ జ్యోతిష్య పండితులు ఉపద్రష్ట వరప్రసాద్

విజయనగరం: వసుధపై వసంతం వికసించిన తొలిరోజు ఉగాది అని, ఉగాది నాడు పంచాంగ శ్రవణం పరమ పవిత్రమని, ఫలప్రదంగా విళంబి నామ సంవత్సరం గడుస్తుందని ప్రముఖ జ్యోతిశ్శాస్త్రవేత్త ప్రముఖ జ్యోతిశ్శాస్త్రవేత్త ఉపద్రష్ట వరప్రసాద్ అన్నారు. ప్రముఖ భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో ఆదివారం రాత్రి పంచాంగ పఠనం గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిథి, వారము, నక్షత్రము, యోగము, కరణము అనే ఐదింటి కలయికే పంచాంగమని, దీనిలో నవగ్రహ సంచారం, వ్యక్తుల, దేశాల గోచార ఫలములుంటాయని చెప్పి వాటిని వివరించారు. తెలుగు పంచాంగాలు చైత్ర శుద్ధ పాడ్యమితో ప్రారంభమై ఫాల్గుణ అమావాస్య వరకు వివరాలను అందిస్తాయని అన్నారు. 12 రాశుల వారికి ఈ ఏడాది ఉండే ఫలితాలను వివరించారు.

ఏఏ గ్రహాలలో ఏఏ రాశులు ఏఏ నక్షత్రాలు ఏ రకంగా సంచరిస్తాయో, సంచారం వలన ఏ విధమైన పరిణామాలు సంభవిస్తాయో వివరించారు. అనంతరం దేవాలయం ధర్మకర్త దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు వరప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.




**పాల్గొన్నారు. కార్యక్రమంలో 500మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మానవహారంలో పాల్గొన్నారు. పోలీసులు అరెస్టు చేసి 3వటౌన్ తీసుకువెళ్ళి విడుదల చేశారు.**

**ఈ కార్యక్రమంలో కొయ్య ప్రసాద్‌రెడ్డి, హనోక్, రవిరెడ్డి, మొల్లి అప్పారావు, పాత్రుడు, శివరామకృష్ణ, విజయచంద్ర, మొగ్గ ఆది నారాయణ, కనకరాజు, యల్లాజీ, గిరిబాబు, గణేష్‌రెడ్డి, సురేష్, నీలరెడ్డి, త్రినాథ్, రవి తదితరులు పాల్గొన్నారు.**

**వైయస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ కన్వీనర్ వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఢిల్లీలో (పార్ల మెంటు)లో వైయస్సార్‌సీపీ (ఎంపి)లు ప్రవేశపెట్టిన ప్రత్యేక హోదాపై అవిశ్వాస తీర్మానానికి మద్ధతుగా ఇసుకతోట జంక్షన్‌లో 'ప్రజా మానవహారం' జరిగింది. వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా వైయస్సార్‌సీపీ మాత్రమే ప్రత్యేక హోదాపై పోరాటం చేస్తుందని, టీడీపీ కేవలం ప్యాకేజీ కోసం డ్రామాలు ఆడుతుందన్నారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజల సమస్యలు తెలుసుకుని మన రాష్ట్రానికి త్వరలో సీఎంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ అధ్యక్షుడు తైనాల విజయకుమార్**



# మీ కోసం (ప్రజావాణి 210 దరఖాస్తులు)





విశాఖపట్నం: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం (ప్రజావాణి) కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ వినతులను అధికారులకు సమర్పించారు. మీ కోసం కార్యక్రమానికి 210 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సృజన, జెసి-2 డా.సిరి, జిల్లా రెవెన్యూ అధికారి సి.చంద్రశేఖరరెడ్డి, ఇన్‌ఛార్జి ఆర్‌డీవో గోవిందరాజులు మీ కోసం కార్యక్రమంలో పాల్గొని పలు ప్రాంతాల నుండి వచ్చిన వారి నుండి స్వయంగా వినతులను స్వీకరించారు. గృహాలు, రేషన్ కార్డులు, భూమి వివాదాలు, పింఛన్ల మంజూరు మరియు ఇతర సమస్యలకు సంబంధించిన విజ్ఞాపనలను సమర్పించారు. మీ కోసం కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా

# ఎన్టీపీసీలో ఉగాది సంబరాలు



పరవాడ: మండలంలోని ఎన్‌టిపీసీ సింహాద్రి దీపాంజలినగర్ లో సాగరిక రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో సాధన క్రీడామైదానంలో ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గ్రూపు జనరల్ మేనజర్ ఎ.మైతి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ సంస్కృతి, సంప్రదాయాలను అనుగుణంగా ఉగాది సంబరాలను నిర్వహించడము పట్ల ఆయన ఆనందము వ్యక్తము చేశారు. దీపికా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం, ఎగ్జిబిషన్, కోలాటములు మరియు సంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరము అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఒఅండ్అమ్ జిఎమ్ సాహు, జనరల్ మేనజర్ జిఎమ్ వర్మ, హెచ్అర్ ఎజిఎమ్ శివప్రసాద్ మరియు అధిక సంఖ్యలో మహిళలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## విమలారాణికి

# జాతీయ విశిష్ట సేవాపురస్కారం

విజయనగరం: పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, ఫిలాంత్రోఫిక్‌సొసైటీ సంయుక్తంగా సోమవారం ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరంలో ఆనం రోటరీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయనగరంకు చెందిన కె.విమలారాణికి జాతీయ విశిష్ట సేవా పురస్కారం లభించింది. భాష, సంస్కృతి,సామాజిక, కళారంగాలలో విశేష ప్రతిభ కనబరచిన 22 మందికి ఈ పురస్కారాలు ప్రదానం చేసారు. విమలారాణికి పురస్కారం రావడం పట్ల తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ స్వప్న హైందవి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జక్కురామకృష్ణలు హర్షం వ్యక్తం చేశారు.

## పిఎన్ఎం హైస్కూల్‌కు

# రెండు ఐరన్ బీరువాలు వితరణ



భీమునిపట్నం : స్థానిక పి.ఎన్.ఎం. హై. స్కూల్ కు పూర్వపు ప్రదానోపాద్యాలు అవనాపు అప్పలనాయుడు తన బార్య కాంతమ్మ జ్ఞాపకార్ధం రెండు ఐరన్ భీరువాలు విరాళంగా పి.ఎన్.ఎం.హై స్కూల్ హెచ్ ఎం.బి.ఈశ్వరరావు కు అందజేసారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఆనందరావు,అవనాపు.రవికుమార్ ,పి.ఎన్.ఎం. హై. స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు లీలావతి పుట్టిన రోజు వేడుకలు

భీమునిపట్నం : స్థానిక కృష్ణా కాలనిలో వున్న నవజీవన్ సేవా ఆశ్రమంలో వీ కేర్ యు స్వచ్ఛంద సేవా సంస్థ ఇన్ ఛార్జ్ వెంపాడ.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కురిమిన లీలావతి పుట్టిన రోజు వేడుకలు గణంగా జరిగాయి. నవజీవన్ సేవా ఆశ్రమంలో ఆమె కేక్ కట్ చేసి ఆశ్రమంలో వున్న పిల్లలకి పంచారు.

ఈ కార్యక్రమం లో సంస్థ నిర్వాహకురాలు వి.స్వాతి, వార్డెన్ కె. సురేష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది చివరి పేజీ.. పింఛను ఒక మజిలీ

విజయనగరం: పళ్ళూడిన ముసలి అవ్వ... ప్రశ్నార్ధకంగా మారిన వెన్నెముక. ఆమె ఒక ముదుసలి తాము ఇంకా బతికున్నామని పింఛనుకోసం ధృవపత్రానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. ప్రతీ ఏటా ఇది తప్పదని తెలుసు..వచ్చే ఏడాదికి ఉంటామో లేదో ఇదే చివరి పయనం అనుకుని ఆఫీసును ..ఆ సిబ్బందిని పలకరిస్తారు. కానీ ఆ పత్రం కోసం నిరీక్షణ తప్పదు. ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకోవడం ముఖ్యం కాదు.. దాన్ని అమలు చేయడమే ప్రధానం.. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు కాకపోతే ఫలితం ఎలా ఉంటుంది అనేదానికి జీవితం చరమాంకంలో పింఛనుదారులు పడుతున్న బాధలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.ప్రతీయేడాది పింఛనుదారులు తాము బతికున్నామని ధ్రువీకరించే లైవ్‌సర్టిపికేట్‌ను ఖజానా శాఖకు అందజేయాలి. ఈ సర్టిఫికేట్ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వృద్ధులైన పింఛనుదారులకు శాపంలా తయారైంది. ప్రభుత్వ నిర్ణయాన్ని అర్థం చేసుకుని అమలు చేయాల్సిన క్రింది స్థాయి అధికారులు, సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో ఆ పండుటాకులు పింఛను కోసం విలవిలలాడుతున్నారు.

కొత్త నిబంధనతో తిప్పలు..

ప్రతీయేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పింఛనుదారులు ఖజానా శాఖకు లైవ్ సర్టిఫికేట్‌ను అందజేయాలి. ప్రతీయేడాది డిసెంబరు నెలలోగా ఈ ప్రక్రియ పూర్తవుతుంది. కానీ, ఈ ఏడాది కొత్త నిబంధనను ప్రభుత్వం అమలు చేసింది. పింఛనుదారులు తమ వేలిముద్రలతో లైవ్ సర్టిఫికేట్‌ను సమర్పించాలి. పింఛనుదారులు వేలిముద్రతో ఆ వ్యక్తి ఆధార్‌కార్డు అనుసంధాన మవుతుంది. తద్వారా ధ్రువీకరణ జరుగుతుంది. ఇందుకోసం ప్రభుత్వం ఖజానా శాఖకు ఆదేశాలు జారీ చేసింది. అప్పటికప్పుడు యంత్రాలను ఏర్పాటుచేశారు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి గడువును కూడా ప్రభుత్వం పెంచింది. ఈ ఏడాది ఏప్రిల్ 15వ తేదీలోగా ఈ పద్ధతిలో లైవ్ సర్టిఫికేట్‌ను పింఛనుదారులు సమర్పించవచ్చు. అయితే సమస్యంతా ఇక్కడే ప్రారంభమైంది. పింఛనుదారులు రెండు రకాలుగా ఉంటారు. సాధారణంగా ఉద్యోగవిరమణ పొందిన వ్యక్తి పింఛనుదారుడు ఒకరు అయితే, ఆ వ్యక్తి మృతిచెందిన సందర్భంలో అతని భార్యకు కుటుంబపింఛను అందజేస్తారు. వీరు రెండోరకం. వీరందరూ కూడా ప్రస్తుతం ప్రభుత్వం సూచించిన విధంగా వేలిముద్రలతో లైవ్‌సర్టిఫికేట్‌ను అందజేయాలి. వేరే ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తు న్నారు. దీంతో సాయం త్రం 4 నుంచే ఒకొక్కరూ జారు కుంటున్నారు. ఉదయం వారంతా కార్యాలయానికి చేరు కునే సరికి పుణ్యకాలం గడిచి పోతోంది. ఈ నేపథ్యంలో పింఛనుదారుల పరిస్థితి అయో మయంగా తయారైంది. పింఛనుదారుల్లో అత్యధిక మంది 70సంవత్సరాలు నిండినవారే. 80 సంవత్సరాలు నిండిన పింఛనుదారులు కూడా ఉన్నారు. వీరు తమకు తాముగా కార్యాలయానికి రాలేరు. వారివెంట తోడు ఎవరో ఒకరు ఉండాలి. ఎక్కడో దూరం నుంచి ఎవరినో ఒకరిని బతిమిలాడుకుని, ఛార్జీలు పెట్టుకుని వారు వస్తుంటారు. తీరా, వచ్చిన తరువాత ఇక్కడ పని అవ్వదు. సిబ్బంది



చావు కబురు చల్లగా చెబుతారు. సర్వర్లు పనిచేయడం లేదనో, వేలిముద్రలు పడటం లేదనో ఎదోఒకటి చెప్పుకొస్తారు. నిజమో, కాదో తెలియని పరిస్థితి. ఆ పండుటాకులు ప్రశ్నించలేరు. గాజు కళ్లల్లో పోయే ప్రాణాన్ని పట్టివుంచుకొని దీనంగా నిలబడివున్న ఆ వయోవృద్ధులను చూసి సిబ్బంది కనీసం కనికరించరు. లేదు వెళ్లిపో.. అనేస్తారు. ఎప్పుడురావాలో కూడా చెప్పరు. అడిగితే మాత్రం ఎప్పుడో రమ్మంటారు. ఉత్తర్వు లనూ పట్టించుకోరు.. 80సంవత్సరాలు దాటిన పింఛనుదారులకు ఎప్పటిమాదిరిగానే సాధారణ సర్టిఫికేట్ తీసుకోవాలని, వారిని ఇబ్బంది పెట్టొద్దని ప్రభుత్వంతన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కానీ, ఈ విషయాన్ని సిబ్బంది చెప్పరు. ఒకవేళ ఎవరైనా ప్రశ్నిస్తే సర్టిఫికేట్ ఇచ్చి వెళ్లండి.. కానీ, తరువాత వేలిముద్రలు వేయాల్సిందే అంటో భయపెట్టడం సర్వసాధారణమైంది. 80సంవత్సరాలు దాటిన వ్యక్తి వేలిముద్రలు సరిగ్గా పడవు. ఈ కారణంగానే ప్రభుత్వం ఈ వెసులుబాటు ఇచ్చింది. కానీ, క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు, సిబ్బందికి ఇవేమీ పట్టవు. వచ్చిరాగానే ఎప్పుడు వెళ్లిపోదామా అంటూ గడియారం వైపు చూడటమే వారి పని. పాపం... ఇవేమీ తెలియని ఆ పండుటాకులు ప్రభుత్వం ఇచ్చే ఆ డబ్బుతోనే తమ చరమాంకం గడపాలన్న ఒకేఒక్క కారణంతో ఖజానా కార్యాలయాలు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినప్పటికీ, కనికరం లేదు. అప్పుడే ఫిబ్రవరి నెలవచ్చింది. ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగాలు చేసి చరమాంకంలో పింఛన్ల కోసం తిప్పలు పడుతున్న ఆ వయోవృద్ధులపై కనికరం చూపాల్సిన బాధ్యత అటు ప్రభుత్వంపైన, ఇటు అధికారులపైన కూడా ఉందనేది సర్వత్రా వ్యక్తమవుతోంది.

# కన్నుల పండువగా నృత్యోత్సవం



విజయనగరం: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో సోమవారం సాయంత్రం ఏర్పాటుచేసిన నృత్యోత్సవం కన్నుల పండువగా సాగింది. ఎం.మానస జ్యోతి, కె.వి.ఎస్.మోహనిక, కె.వి.ఎస్.ప్రియాంకల నృత్యదర్శకత్వంలో శ్రీసాయిలలితా నృత్యకళానికేతన్‌కు చెందిన 30 మంది విద్యార్థులు తమ నృత్యంతో ఆకట్టుకున్నారు. గురుబ్రహ్మ, గురుర్విష్ణు, గణనాయక పాటలతో ప్రారంభించి, దేవేంద్రమౌళి, నగుమోము కనలేని, ధింతనన ధింతానన, ఒక పరికొకపరి, కులుకగ నడవగ అమ్మలారా, కృష్ణం కలయ సఖి సుందరం, ఘల్లు ఘల్లు గజ్జెల తదితర గీతాలకు చిన్నారులు ఎం.రేణుక, కె.నిఖిత, ఈపు మోహన సాయి మోనిషా, జి.శ్రీసాత్విక, ఎ.శైలజ, జి.చాందిని, ఆర్.శ్రీనిధి, బి.వర్షిణి, పి.తేజస్విని, ఎం.రజిత, ఎస్.బిల్వాని, మహతి, షాగుత, వర్ష, పవన్‌కుమార్ తదితరులు చక్కగా నృత్యప్రదర్శన గావించారు.

## చిన్నారి వైద్యానికి

# జీనా వెల్ ఫేర్ సంస్థ ఆర్థిక సహాయం

భీమునిపట్నం : భీమిలి కి చెందిన రామాలయం అర్చకులు రామాచార్యులు కుమార్తె వల్లి ప్రణీత అనే చిన్నారి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోంది , ఇది వరలో జీనా వెల్ ఫేర్ సంస్థ ఐదు లక్షలు ఆర్థిక సహాయం చేసింది. వ్యాధి తీవ్రతను బాధితురాలి పరిస్థిని గమనించిన జీనా వెల్ ఫేర్ సంస్థ ఈ రోజు ఇంకో లక్షా ఏభైవేలు అందజేశారు.ఈ కార్యక్రమం లో సంస్థ ప్రతినిధులు నాగోతి.మహేష్,పోతిన వెంకటేష్,అరవింద్ లు ఎన్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీలో సొండి కులస్తులను చేర్చాలి

విశాఖపట్నం: బీసీడీలో వున్న సొండి కులస్తులను ఓబీసీలో చేర్చాలనే ప్రయత్నానికి ఎంతోమంది ప్రముఖులకు ధన్యావాదాలని ఏపీ సొండికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి.నీలకంఠం అన్నారు. ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సొండి కులస్తులను బీసీడీలో చేర్చిందని దానివలన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి 2009లో చేర్చినందున శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో ప్రత్యేకించి కృపారాణి గెలుపుతో మా కులస్తుల మద్ధతు లభించిందని అలాగే తెలుగు దేశం ప్రభుత్వం కూడా తమను బీసీడీ నుంచి ఓబీసీలోకి చేర్చాలని వారు కోరారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడుకి రాష్ట్ర రాజధాని అమరావతి వినతిపత్రం కూడా అందించడం జరిగిందని ఆయన అన్నారు.

## ఎరుకుమాంబకు

# వెండి మకరతోరణం



విశాఖపట్నం : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని దొండపర్తి ఎరుకుమాంబ అమ్మవారికి వెండి, మకర తోరణాన్ని అలంకరించారు. దాతలు పోతిన నరసింహనాయుడు, రమణి ప్రియ దంపతుల చేతుల మీదుగా ఈ తోరణాన్ని అమ్మవారికి అలంకరించి ఆవిష్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు మళ్ల వెంకట సత్యనారాయణ, ముక్కి రామకృష్ణ, గొరుసు గురునాధరెడ్డి, చిట్టిబోయిన గంగరాజు, సుజాత, గుజ్జు ఈశ్వరరావు, 15వవార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శంకరరావు, లక్ష్మీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉగాది వేడుకలు



మాధవధార : ఉగాది వేడుకలు మాధవధారలో గల శ్రీ మాధవ యువజన సమాజం అవరణలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం మాధవధార శ్రీ శ్రీ శ్రీ కొత్త మహలక్ష్మి అమ్మవారు ధర్మకర్త సనపల బంగారురాజు అద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గాయిత్రి విద్యా సంస్థల వ్యవస్థాపకులు, అధ్యాత్మిక గురువు సనపల జగధీశ్వరరావు హజరయి జ్వోతి ప్రజ్వోలన చేసి ఉగాది ఉత్సవాలను ప్రారం భిం చారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా కొత్త మహలక్ష్మి అమ్మవారు ధర్మకర్త సనపల బంగారురాజు మాట్లాడుతూ ఈ ఉగాది ఉత్సవాలను మెట్ట మొదటి సారిగా ఈ యేడాది నుండి ప్రారం భించామని తెలిపారు. ప్రతి యేడాది ఈ ఉగాది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉచితంగా పంచాంగాలను పంపిణి చేశారు. స్టీల్ కప్పుల్లో ఉగాది పచ్చడిని ఇంటింటికి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాత్మిక సేవాకులు పేడాడ వెంకటరావు, కంచరాన వల్లభరావు, సనపల పాండురంగారావు, సనపల మాధవరావు, పైడి ప్రతాప్, సనపల రవికుమార్, పేడాడ సత్యనారాయణ, కర్రి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజలముందుకు ప్రభుత్వ పాలన



యానాం : పరిష్కారంకాని ప్రజా సమస్యలను వారిముందు పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రజల ముందుకు ప్రభుత్వ పాలన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు అన్నారు. సోమవారం ఉదయం పరంపేటలో , అయ్యన్ననగర్, న్యూ రాజీవ్ నగర్, కురసం పేటలలో ప్రజల ముందు కు ప్రభుత్వ పాలన కార్యక్రమానికి పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి వల్లాడి క్రిష్ణారావు ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఇప్పటి వరక ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాయాల చుట్లూ తిరుగుతున్న ప్రజలకు ప్రస్తుతం జరుగుతన్న కార్యక్రమంలో వారికున్న సమస్యలను వినతిపత్ర రూపంలో తెలియచేయాలని ఆ సమస్యలను అధికారులు పరిష్కరిస్తు, ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తారన్నారు. పరంపేటలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు క్రీడామౌదానం ఏర్పాటుచేస్తానని అంబేద్కర్ పార్కు అభివృద్ధికి రూ. 10 లక్షలు నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. పరంపేట, సొసైటీ పంటపొలాలకు రెండు పంటలు పండించేవిధంగా భూగర్భ పైపులైను పనుఉ ఈ ఏడాదిలో పూర్తి అవుతాయని రైతులకు ఎంతోమేఉ జరుగుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుతత్వాల నుండి యానాం అభివృద్ధికి అనేక భారీ ప్రాజెక్టులు తీసుకొచ్చి అమలుచేస్తున్నామన్నారు. ఈ కార్యరక్రమంలో సుమారు 300 వినతి పత్రాలను ప్రజలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి దవులూరి సుబ్రబమణ్యేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ జి . గౌరీ సరోజ, ఆసుపత్రి డిడి ఎంవిఎస్ ప్రసాద్, పప్రజా పనుల శాఖ ఇఇ రాందాసు, సిఐ గిడ్ల సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూలాఫ్ వండర్ కిడ్స్ విద్యా విధానం దేశానికే తలమానికం

### వీఎస్ఈజెడ్ కమిషనర్ డాక్టర్ త్రినాథ్ కుమార్



విశాఖపట్నం : జ్ఞాన సముపార్జన ఏ ఒక్కరి సొత్తుకాదు, అది ప్రాధమిక హక్కు కావాలి, అప్పుడే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని వీఎస్ఈజెడ్ కమిషనర్ డాక్టర్ త్రినాథ్ కుమార్ అభిప్రాయం వ్యక్తంచేశారు. స్కూలాఫ్ వండర్ కిడ్స్ ఓ సరస్వతీ నిలయంగా గోచరిస్తోంది. ఇక్కడ విద్యావిధానం దేశానికే తలమానికంగా నిలుస్తుందని ఆయన కితాబునిచ్చారు. సోమవారం ఉదయం విఐపి రోడ్డు, విజయా కో-ఆపరేటివ్ లేఔట్‌లో స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌లో టాలెంట్ ఎగ్జిబిషన్‌కు ఆయన ముఖ్య అతిధిగా , శ్రీకాకుళం డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సిహెచ్ శ్రీదేవి గౌరవ అతిధిగా హాజరై లాంఛనంగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల మెదడుకు పదునుపెట్టి, క్లిష్టమైన అంశాలను కూడా సునాయాసంగా అభ్యసించడమే అసలుసిసలు విద్య అనే రహస్యాన్ని ఈ టాలెంట్ ఎగ్జిబిషన్ చాటి చెప్పిందన్నారు. స్కూలాఫ్ వండర్ కిడ్స్ అవలంభిస్తున్న విద్యా విధానం అద్భుతమని దీనికి యాజమాన్యం, సిబ్బంది అభినందనీయలని శ్రీకాకుళం డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సిహెచ్ శ్రీదేవి అన్నారు. స్వతహాగా ఉపాధ్యాయులైన పాఠశాల వ్యవస్థాపకులు మళ్లరామునాయుడు, శ్రీవాణి దంపతులు తమ పిల్లలు చదువు పేరుతో బండెడు పుస్తకాలు మోస్తూ, హెూమ్ వర్క్‌తో సతమతమవ్వడం సరికాదని భావించి రూపొందించిన 'ఎడ్వీజ్' (ఎడ్యు ఈజీ) విధానం అద్భుతమని అతిధులకు వివరించారు

## పాదగయను దర్శించిన హంపీ పీఠాధిపతి

పిఠాపురం : దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయా క్షేత్రాన్ని హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య తీర్థస్వామి దర్శించుకున్నారు. సోమవారం పట్టణానికి విచ్చేసిన పీఠాధిపతికి ఆలయ చైర్మన్ కొండేపూడి ప్రకాశ్, ఆలయ ఈఓ ఆర్.పుష్పనాథం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. శ్రీ కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు, శ్రీ పురుహూతికా అమ్మవారు, శ్రీ దత్తాత్రేయ స్వామి వార్లను హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య తీర్థస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. అర్చకులు ఆయనకు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం ఆలయ ఈఓ ఆర్.పుష్పనాథం హంపీ పీఠాధిపతికి ప్రసాదం అందజేసారు. ఆలయాన్ని దర్శించుకోవడం తనకు సంతోషాన్ని కలిగించిందని పీఠాధిపతి అన్నారు.

# వైఎసిపి ఆధ్వర్యంలో మానవహారం




అమలాపురం: కేంద్రప్రభుత్వంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి సంఘీభావంగా అమలాపురం గడియార స్థంభం సెంటర్‌లో పార్టీ నాయకులు పినిపే విశ్వరూప్, కుడుపూడి చిట్టాబ్బాయిల ఆధ్వ్యంలో పెద్ద ఎత్తున ప్రజా సంకల్ప మానవహారం నిర్వహించారు. తెలుగుదేశం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి ప్రత్యేక హెూదా కేటాయించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి వెంకటేశ్వరరావు (బాబు), మట్టపర్తి నాగేంద్ర, సంసాని నాని, మట్ట పర్తి మురళీకృష్ణ, ఉండ్రు వెంకటేశ్వరరావు, బొం తు గోదవిందు శెట్టి, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం



యానాం : రిజియన్సీ సిరామిక్ పరిశ్రమ స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనంచేసుకున్నారు. సోమవారం ఉదయం స్థానిక కొత్త బస్టాండు పక్కనే ఉన్న రిజియన్సీ సిరామిక్స్ పరిశ్రమ లీజులో సుమారు27సంవత్సరాల నుండి ఉన్న సుమారు 2 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ శాఖ డిప్యూటీ కలెక్టర్ దవులూరి సుబ్రమణ్యేశమవరరావు, డిప్యూటీ తహశీల్దారు సైజు, ఇతర సిబ్బంది పోలోసు బందుబస్తుమధ్య ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలంలో సాయి క్రీడా వసతి గృహాన్ని నిర్మించాలని లక్ష్యంతో రిజియన్సీకి ఉన్న లీసును రద్దుచేసి స్తాధీనం చేసుకున్నారు. ఆ స్థలంలో స్వాధీనం చేసుకున్నట్లు నోటీసు అంటించారు.

## సత్యదేవున్ని దర్శించిన జనసేన కడలి ఈశ్వరి



అన్నవరం : తూగో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని కాకినాడకు చెందిన కడలి.ఈశ్వరి జనసేన యువకులతో వచ్చి అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామివారి సనిధికి చేరుకొని స్వామివార్ని దర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన పార్టీని గ్రామ స్థాయిలో ప్రతిష్టాత్మకమైనదిగా తిర్చి దిద్దాలని జనసేన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా కుల, మత, వంశపారం పర్యమైన రాజకీయాలు మనకు వద్దని హితవు పలికారు. అలాగే జనసెన అధ్యక్షుడు పవణ్ కళ్యాన్ పిలుపు మేరకు యువకులు ముందుకు రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు మామిడాల. లోకేష్, నాగం రమేష్, తేటగుంట. హరి, కొల్లాబత్తుల.అరుణకుమార్, శివ, గోపి, సత్తార్, లోవరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల ఆశ్రమానికి హట్ డిష్‌లు పంపిణీ

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరంలో విళంబి నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకొని కత్తిపూడి యవసేన యువకులు మొదటిసారిగా అన్నవరం బైపాస్ ఆర్చి దగ్గరలో ఉన్న బెండపూడి గ్రామానికి చెందిన శాంతి వర్దన వికలాంగుల ప్రత్యేక ఆశ్రమములో ఉన్న పిల్లలకు చాక్లేట్స్, బిస్కెట్స్, అరటిపండ్లు పంచిపెట్టి అలాగే ఆశ్రమానికి రైస్ మరియు కర్రీలకు సంభంధమైన హట్ డిస్‌లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జనసేన కార్యకర్తలు మావిడాల. లోకేష్, కరణం .సుబ్రహ్మణ్యం, లక్కీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా కోసం వైసిపి ఆందోళన



నర్సీపట్నం : సోమవారం నర్సీపట్నంలో ప్రత్యేక హోదా కోరుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి జగన్మోహనరెడ్డి తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా రాష్ట్రంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నాలుగేళ్లు కేంద్ర ప్రభుత్వం భాగ స్వామి అయినా సరే ఇప్పటి వరకు ప్రత్యేక హోదా సాధించకపోవడం దారుణమన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైసిపి అధ్యక్షులు కోనేటి రామకృష్ణ, వైసిపి కౌన్సిలర్ తమరాన అప్పల నాయుడు, బోడపాటి సుబ్బలక్ష్మి, నాయకులు ఆరుగొల్లు రాజు బాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శివ సదన్ కాటేజీకి రూ.10 లక్షల విరాళము



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శివ సదన్ కాటేజీ నిర్మాణానికి రావులపాలెంకు చెందిన శ్రీ వెంకటరెడ్డి మరియు రామరాజులు శివ సదన్ రూముకు రూ.10 లక్షల విరాళముగా ఈవో జితేంద్రకు అందజేశారు.

# ఘనంగా విళంబి నామ సంవత్సరం

రావులపాలెం : తెలుగు ప్రజల అత్యంత ప్రాముఖ్యమైన పండుగ ఉగాది పండుగ అని పోతంశెట్టి కనికిరెడ్డి అన్నారు. కోనసీమ ముఖ ద్వారం రావులపాలెంలో వేంచేసియున్న సీతా రామచంద్రస్వామి, షిర్డిసాయిబాబా వార్ల ఆల యంలో బ్రహ్మశ్రీ వెలవెల జ్వాలా సుబ్రహ్మణ్యంచే శ్రీ విలంబి నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం వందలాది మంది భక్తులతో అత్యంత వైభవంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యం పండితులు మాట్లాడుతూ కాలం విలువ తెలుసుకోవడం పంచాంగ శ్రవణ కార్యక్రమ లక్ష్యమని, కాలాన్ని గమనిస్తూ కాలం విలువ తెలుసుకొని మసలుకుంటే జీవిత సారవంతమవుతుందని అన్నారు. నవగ్రహ దేవతలు, తిధి, వార నక్షత్ర, యోగ కరణములు, వాటి ఆధిదేవతల స్మరణ వల్ల దైవానుగ్రహం పొంద వచ్చన్నారు. ఈ విళంబి నామ సంవత్సర రాజ్య పూజ్య ఆదాయ వ్యయాలు తెలియజేసారు. తెలుగు వారందరికీ విళంబి నామ సంవత్సరం ఆనందం, సుఖసంతోషాన్నిస్తుందని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి సుబ్రహ్మణ్యం పండితులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పలువురికి పంచాంగాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో చిన్న కె.వి., మల్లిడి కోటేశ్వరరెడ్డి, కర్రి రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అన్‌రాక్ పరిశ్రమను తెరిపించాలని మీ కోసంలో వినతి




నర్సీపట్నం : లమాకవరపాలెం వద్దగల అన్‌రాక్ పరిశ్రమను వెంటనే తెరిపించి స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరుతూ అఖిలపక్ష కమిటీ రెవెన్యూ డివిజనల్ అధికారికి మీకోసం కార్యక్రమంలో దరఖాస్తు సమర్పించారు. మాజీ శాసన సభ్యురాలు బోళెం ముత్యాలపాప, రుత్తల యర్రాపాత్రుడు, బోళెం వెంకటరమణ మూర్తి తదితరులు కలిసి ఆర్డీవోకి డిమాండ్లతో కూడిన పత్రాన్ని అందించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె .సూర్యారావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మీకోసం కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు ఫిర్యాదులపై వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోలుగుంట మండలం కుసర్లపూడి గ్రామానికి చెందిన బోగర్ల రాజారావు తనకు చెందిన డి ఫారం భూమిని తన తమ్ముడు ఆక్రమించుకున్నారని తనకు వెంటనే న్యాయం చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. నాతవరం మండలం ములగపూడి గ్రామానికి చెందిన దళితులు దరఖాస్తు చేసుకుంటూ తమ కాలనీలో రోడ్లను ధ్వంసం చేస్తున్నారని, వీధి రోడ్లని ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేస్తున్నారని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆర్డీవోకు విన్నవించుకున్నారు. ఆర్డీవో దీనిపై వెంటనే విచారణ జరిపిస్తామన్నారు. వేములపూడి గ్రామానికి చెందిన పద్మనాభుని బెన్నయ్య శెట్టి తాను ప్రస్తుతం అనుభవిస్తున్న భూమి ల్యాండ్ సీలింగ్ లో పోయిందని అంటున్నారని కానీ భూమి తన అనుభవంలో ఉందని ప్రతి సంవత్సరం శిస్తు కూడా కడుతున్నానని చెప్పి దీనిపై విచారణ చేయవలసిందిగా కోరారు. ఇంకా అనేకమంది భూ సమస్యల పైన భూ వివాదాల పైన ఆర్డీవోకు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ కార్యక్రమాలలో కార్యాలయ పరిపాలనాధికారి వి. ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

అమలాపురం: స్థానిక నల్లవంతెన వద్గల బాలయోగి స్టేడియం వద్ద దళిత సేన ఆధ్వర్యంలో చలివేంద్ర శిబిరాన్ని డా.బి.ఆర్ అంబేద్కర్ బ్లడ్ డోనర్ అసోసియేషన్ అధ్యక్షుడు బూల విజయబాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు సేవా కార్యక్రమాలు తమ సంస్థ ద్వారా చేసామని, అంబేద్కర్ ఆశయ స్ఫూర్తితో వారు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మెండి డేవిడ్ రాజు, రొక్కాల నాగేశ్వరరావు, జిల్లెల రమేష్, జంగా నరసింహం, కుమ్మరి రవితేజ, వారా అభినాష్, జానపాటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ి ఘనంగా ప్రారంభమైన సిఆర్‌సి నాటికల పోటీలు



రావులపాలెం : ఉగాది పేరు వింటే చాలు నటీనటులు పూయించే నవ్వులు, రాజకీయ నాయకుల పలకరింపులు, కళాభిమానుల కరచాల ధ్వనులు, సిఆర్‌సి కార్యవర్గ సభ్యుల సందడి అదే సిఆర్‌సి కాటన్ కళా పరిషత్ అని సిఆర్‌సి రూపశిల్పి కళాపరిషత్ కన్వీనర్ డా॥ గొలుగురి వెంకటరెడ్డి (విక్టరి) అన్నారు. సిఆర్‌సి కాటన్ కళా పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక సిఆర్‌సిలో ఆదివారం ఉగాది పండుగ పురస్కరించుకొని 20వ ఉగాది నాటికల పోటీలు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిధిలుగా ప్రముఖ సినీ నటులు తనికెళ్ళ భరణి, ఎల్.బి. శ్రీరామ్‌లు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రముఖులు పాల్గొని అలనాటి నాటికలను ఈ నాటికి ప్రోత్సహిస్తున్న సిఆర్‌సి సభ్యులను అభినందించారు. ఆదివారం జూనియర్స్, సీనియర్స్ చిత్రలేఖనం, రంగవల్లి, గోరింటాకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసారు. సాయంత్రం 4 గంటలకు సాహిత్య విద్యాప్రవీణ, భారతజ్యోతి, రిటైర్డ్ ప్రిన్సిపాల్, నాగార్జున యూనివర్సిటి ఎకడమిక్ సెనెట్ మెంబరు అయిన నిట్టల సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రిచే పంచాంగ శ్రవణం అనంతరం వేద పండితులచే వేద ఆశీర్వచనములు నిర్వహించారు. ఈ సందర్భముగా బహుముఖ ప్రజ్ఞాశాలి అదృష్ట దీపక్‌కు ఆత్మీయ సత్కారం అందించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత, మకర కుండల గ్రహీత, శుక్ల యజుర్వేద విద్యా ప్రవర్ధక సమితి అధ్యక్షులు అగ్రగామి పురస్కార గ్రహీత బ్రహ్మశ్రీ చింతా వెంకట శాస్త్రి అవధానిని ప్రముఖ సినీ రచయిత, నటులు ఎల్బీ శ్రీరామ్‌చే పండిత సత్కారం గావించారు. అనంతరం యంగ్ థియేటర్ & సిద్ధార్థ మహిళా కళాశాల విజయవాడ వారిచే "ఊరు భంగం" నాటిక, హైదరాబాద్‌కు చెందిన మురళీ కళానిలయం వారిచే "దోబూచి" నాటికలు ప్రదర్శించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు నాజర్, కోట శంకరరావు, సిఆర్‌సి అధ్యక్ష కార్యదర్శులు, మల్లిడి కనికిరెడ్డి, కర్రి అశోక్‌రెడ్డి, ఎమ్‌పిపి కోట చెల్లయ్య, ఛాంబర్ అధ్యక్షులు కర్రి సుబ్బారెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి, పలివెల త్రిమూర్తులు, వాడపల్లి ఆలయ చైర్మన్ కరుటూరి నరసింహారావు, కుడిపూడి శ్రీనివాస్, కల్లేపల్లి సూర్యనారాయణరాజు, సిహెచ్ గోపాలకృష్ణ, చెక్కల సూరిబాబు, రుద్రరాజు వెంకట సీతారామాంజనేయరాజు, మల్లిడి ఆంజనేయరెడ్డి, నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, చిర్ల కనికిరెడ్డి, కొవ్వూరి సురేష్ కుమార్ రెడ్డి, ఎమ్‌విఎస్ఎస్ఆర్ కృష్ణంరాజు (రవిరాజు), మన్యం సుబ్రహ్మణ్యేశ్వరరావు, మల్లిడి రంగారెడ్డి అధిక సంఖ్యలో ప్రేక్షకులు తదితరులు పాల్గొన్నారు. సిఆర్‌సి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఉగాది పురస్కరించుకొని సిఆర్‌సి మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. సోమవారం గంగోత్రి పెద కాకాని వారిచే పచ్చ చందురుడు, తెలుగు కళా సమితి, విశాఖపట్నం వారిచే కుక్కపిల్ల, అమెచ్యూర్ డ్రమోటిక్ అసోసియేషన్ చిలకలూరిపేట వారిచే అక్క అలుగుడు చెల్లి సణుగుడు నాటికలను ప్రదర్శించారు.

## టీ తాగడానికీ డబ్బుల్లేని పరిస్థితుల్లో హీరోయిన్



ఒకప్పుడు బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ పక్కన నటించిన హీరోయిన్ ఆమె. కానీ ఇప్పుడు కనీసం టీ తాగడానికీ డబ్బుల్లేని దుస్థితిలో ఉంది. క్షయ రోగంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేక సతమతమవుతున్నది. ఆమె పేరు పూజా దద్వాల్. 1990ల్లో వచ్చిన వీర్‌గతి సినిమాలో సల్మాన్ ఖాన్ పక్కన నటించింది. ఇప్పుడదే సల్మాన్‌ను సాయం అడిగేందుకు ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోయిందని ఆమె చెప్పింది. 15 రోజులుగా పూజా ముంబైలోని శివిడి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నది. ఆమె బాంబే టైమ్స్ పత్రికతో మాట్లాడుతూ తన బాధను వెల్లగక్కింది. 6 నెలల కిందట టీబీ ఉందని తెలిసింది. అప్పటి నుంచి సల్మాన్ ఖాన్‌ను సాయం అడుగుదామని ప్రయత్నిస్తున్నాను. కానీ అది సాధ్యం కాలేదు. నా వీడియోను అతను చూస్తే ఎంతో కొంత సాయం చేస్తాడన్న ఆశ ఉంది. 15 రోజులుగా ఇదే హాస్పిటల్‌లో ఉన్నాను. నా దగ్గర నయా పైసా కూడా లేదు. కనీసం టీ కోసం కూడా ఇతరులపై ఆధారపడాల్సి వస్తున్నది అని పూజా వాపోయింది. ఆమె ఆరోగ్యం బాగా లేదని తెలిసిన తర్వాత భర్త, ఇతరు కుటుంబ సభ్యులు ఆమెను ఇంటి నుంచి పంపించేసినట్లు తెలిసింది. వీర్‌గతితోపాటు పూజా హిందుస్థాన్, సిందూర్ సౌగంధ్‌లాంటి సినిమాల్లో నటించింది.

## బన్నీ అయినా హిట్ కొడతాడా?



కోలీవుడ్‌లో హిట్టు కొట్టడం తెలుగు హీరోలకు అందని ద్రాక్షగానే మిగిలింది. గత దశాబ్దకాలంలో మహేష్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్, రవితేజ ఇలా టాలీవుడ్ అగ్ర నటులందరూ అనువాదాలతో తమిళ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. అయితే తెలుగులో బ్లాక్‌బస్టర్లుగా నిలిచిన మగధీర, శ్రీమంతుడు చిత్రాలు సైతం తమిళంలో అంతంతమాత్రంగానే ఆడాయి. కొన్ని నెలల క్రితం మహేష్‌బాబు తమిళ ఎంట్రీ సినిమా స్పైడర్ దారుణ పరాజయాన్ని మూటగట్టుకుంది. మావీరన్‌గా తమిళంలోకి అనువదించిన మగధీర సైతం మెప్పించలేకపోయింది. విమర్శకుల ప్రశంసలు దక్కినా తమిళ తంబీల ఆదరణకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ చాలాకాలంగా తమిళంలో ఆరంగేట్రం చేయాలని ప్రయత్నిస్తున్నాడు. తమిళంలో డైరెక్టుగానే నటిస్తాను తప్ప, అనువాదంతో కోలీవుడ్‌కి రానని భీష్మించుకుని కూర్చున్నాడు. గతేడాది లింగుస్వామి దర్శకత్వంలో ఒక చిత్రాన్ని అట్టహాసంగా ప్రారంభించారు కూడా. అయితే ప్రస్తుతం ఆ సినిమా అటకెక్కేసింది. దీంతో ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న తన డ్రీమ్ ప్రాజెక్టు నా పేరు సూర్య నా ఇల్లు ఇండియాను తమిళంలో అనువదిస్తున్నారు.

ఎన్ పేరు సూర్య ఎన్ వీడు ఇండియా పేరుతో తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సైనిక నేపథ్యంతో వక్కంతం వంశీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై తెలుగు రాష్ట్రాల్లో భారీ అంచనాలే ఉన్నాయి.

## హృదయాల్ని గెలిచేలా...



అలనాటి మేటినటి సావిత్రి జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న చిత్రం మహానటి. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. వైజయంతీమూవీస్, స్వప్న సినిమా పతాకాలపై ప్రియాంకదత్ నిర్మిస్తున్నారు. కీర్తి సురేష్, సమంత కీలక పాత్రలను పోషిస్తున్నారు. మే 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది. సావిత్రి జీవితంలోని ముఖ్య ఘట్టాలను ఆవిష్కరిస్తూ రూపొందుతున్న చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. 1990 మే 9న వైజయంతీ సంస్థలో రూపొందిన జగదేకవీరుడు అతిలోక సుందరి విడుదలైంది. అదే తేదీన ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఆనందంగా ఉన్నది అని తెలిపారు.

## చిట్టిబాబు చాలా దగ్గరయ్యాడు.. రాజమౌళి ట్వీట్



మెగా హీరో నటించిన రంగస్థలం మూవీ థియేట్రికల్ ట్రైలర్ విడుదల అయిన విషం తెలిసిందే. ఈ ట్రైలర్ చూసిన దర్శకులు, నిర్మాతలు హీరో రామ్ చరణ్‌ని పొగడ్తలతో ముంచేస్తున్నారు. ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలు తమను హత్తుకున్నాయని సోషల్ మీడియాలో ట్వీట్లు పెడుతున్నారు.

తాజాగా దర్శక ధీరుడు రాజమౌళి కూడా స్పందించారు. చిట్టిబాబు తనకు మరింత దగ్గరయ్యాడని ట్విట్టర్ ద్వారా పోస్ట్ పెట్టారు. ట్రైలర్ చూసిన తర్వాత చరణ్‌పై తనకున్నఆప్యాయత చాలా పెరిగిందని పేర్కొన్నారు. జగపతి బాబు పాత్ర చాలా బాగుందని, తనకు బాగా నచ్చిందని తెలిపారు. ఈ సినిమా రిలీజ్ కోసం తను ఆతృతగా ఎదురు చూస్తున్నట్లు ట్వీట్ చేశారు. దీంతో నెటిజన్లు తెగ లైక్స్ కొడుతూ షేర్లు చేస్తున్నారు. రాజమౌళి, రామ్ చరణ్ తేజ్ కాంబినేషన్‌లో వచ్చిన మగధీర చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ అయిన విషయం తెలిసిందే.

## సుమంత్ సుబ్రహ్మణ్యపురం ప్రారంభం




సుమంత్ కథానాయకుడిగా నటిస్తున్న 25వ చిత్రం సుబ్రహ్మణ్యపురం ఆదివారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. టారస్ సినీ కార్ప్ పతాకంపై ధీరజ్ బొగ్గరం, బీరం సుధాకర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈషా కథానాయిక. పూజా కార్యక్రమాల అనంతరం హీరోహీరోయిన్లు సుమంత్, ఈషాపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి కథానాయకుడు నాగచైతన్య క్లాప్‌నివ్వగా, దర్శకుడు ప్రశాంత్‌వర్మ కెమెరా స్విఛాన్ చేశారు. తొలి సన్నివేశానికి చందూ మొండేటి గౌరవ దర్శకత్వం వహించారు. చిత్ర లోగోను ఏపీ ఎంపీ జె.సి. దివాకర్‌రెడ్డి, రాజశేఖర్, జీవిత సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ సూపర్ నేచురల్ అంశాల మేళవింపుతో సాగే మిస్టరీ థ్రిల్లర్ ఇది.

ఈ జోనర్‌లో నేను సినిమా చేయడం ఇదే తొలిసారి. నాకు ఈ తరహా కథాంశాలతో సినిమాలు చేయడమంటే చాలా భయం. కానీ కథ నచ్చి ఈ సినిమాను అంగీకరించాను. కథ వింటున్నప్పుడు తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠతతో ఎదురుచూశాను. ఆ అనుభూతి ప్రేక్షకులకు కలిగిస్తుంది అని తెలిపారు. సుమంత్‌కు తాను అభిమానినని, విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ ఆయన సినిమాలు చేస్తుంటాడని, సుమంత్‌తో సినిమా చేయడం ఆనందంగా ఉందని చిత్ర కథానాయిక ఈషా చెప్పింది. ధీరజ్ బొగ్గరం మాట్లాడుతూ సుమంత్ నటిస్తున్న 25వ సినిమా ఇది. మాగ్నస్ సినీప్రైమ్ సహకారంతో మా సంస్థ ద్వారా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. సుధాకర్‌రెడ్డి చక్కటి తోడ్పాటును అందిస్తున్నారు. తప్పకుండా ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకముంది అని తెలిపారు.

దర్శకుడు సంతోష్‌జాగర్లపూడి మాట్లాడుతూ దర్శకుడిగా నా తొలి సినిమా ఇది. ఇంతకుముందు మూడు లఘు చిత్రాలను రూపొందించాను. వాటికి సామాజిక మాధ్యమాల్లో ఇరవై ఆరు లక్షలవరకు వీక్షణలు లభించాయి. వాటికి వచ్చిన గుర్తింపును చూసి నిర్మాతలు ఈ సినిమాను రూపొందించే అవకాశమిచ్చారు. తొలుత సుమంత్‌కు సింపుల్‌గా కథను చెప్పాలని అనుకున్నాను.

సినిమాలోని ప్రతి పాయింట్‌ను క్లియర్‌గా చెప్పాలని ఆయన సూచించారు. దాదాపు రెండున్నర గంటల పాటు కథ చెప్పగానే సినిమా చేస్తానని అంగీకరించారు. ఏప్రిల్ మూడవ వారం నుంచి రెగ్యులర్ షుటింగ్ ప్రారంభిస్తాం అని తెలిపారు. మిస్టరీ థ్రిల్లర్ నా ఫేవరేట్ జోనర్. ఈ తరహా కథాంశాల్లో సంగీతానికి ఎక్కువగా ప్రాధాన్యముంటుంది అని శేఖర్‌చంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీరం సుధాకర్‌రెడ్డి, లక్ష్మీసింధూజ, సుమత్రిపురాన తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆర్.కె. ప్రతాప్, సంగీతం: శేఖర్‌చంద్ర, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్, కళా దర్శకత్వం: లక్ష్మీసింధూజ గ్రంధి, పబ్లిసిటీ డిజైనర్: గణేష్ పి.ఎస్.ఆర్, కో డైరెక్టర్: రాధకృష్ణ, కాశినాథ్, క్యాస్టూమ్ డిజైనర్: సుమ త్రిపురాన, , నిర్మాతలు: ధీరజ్ బొగ్గరం, బీరం సుధాకర్‌రెడ్డి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సంతోష్ జాగర్లపూడి.

## అట్టా సూడమాకు రంగమ్మత్తా!!



మోకాళ్ల వరకూ పసుపు రంగు చీరకట్టి.. నల్లని రవిక తొడిగి.. నుదటపైన రూపాయంత బొట్టుపెట్టి.. కళ్లకేమో కాటుకెట్టి.. మట్టిగాజులు చేతికెట్టి.. వేళ్లకేమో మెట్టెలు తొడుగుతూ.. ఓరచూపుతో గుచ్చి గుచ్చి చంపేస్తుంది రంగమ్మత్త. రంగస్థలం మూవీలో చిట్టిబాబుకి అత్తగా నటిస్తున్నట్టు నిన్న జరిగిన ప్రి రిలీజ్ ఈవెంట్‌లో ప్రేక్షకులకు తెలియజేసిన యాంకర్ అనసూయ.. తాజాగా రంగమ్మత్త ఫస్ట్‌లుక్‌తో తిరిగి సోషల్ మీడియాలోకి ఎంట్రీ ఇచ్చింది.

ఇటీవల కాలంలో పిల్లోడి చేతిలో ఫోన్ పగల కొట్టిన వివాదంలో హర్ట్ అయ్యి సోషల్ మీడియా నుండి క్విట్ అయిన అనసూయ తిరిగి ఇదిగో మీ రంగమ్మత్త అంటూ రీ ఎంట్రీ ఇచ్చింది. నిన్న జరిగిన రంగస్థలం ప్రి రిలీజ్ వేడుకలో యాంకర్ అనసూయ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మెగాస్టార్ చిరంజీవి, చెర్రీతోపాటు డైరెక్టర్ సుకుమార్ సైతం అనసూయ పాత్రను పొగడ్తలతో ముంచెత్తడంతో ఆమె పాత్ర ఎలా ఉండబోతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో మొదలైంది.

కాగా ప్రేక్షకుల్ని థ్రిల్ చేస్తూ రంగమ్మత్త ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్ర యూనిట్. రంగమ్మత్త ఫస్ట్‌లుక్‌లో ఓ పల్లెటూరులో మధ్య వయస్సు మహిళ ఎలా ఉంటుందో అచ్చం అలాగే ఉంది అనసూయ. కట్టు, బొట్టు పాతకాలం అత్తకు కరెక్ట్‌గా సరిపోయిందంటూ రంగమ్మత్త కొత్త గెటప్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. కాగా మొదట్లో ఈ పాత్ర తాను చేయనని గోల చేశానని.. అయితే తాను రామ్ చరణ్‌కు మాత్రమే అత్తనని అంటున్నారు అనసూయ.

## ఆ రూ.11,300కోట్లు ఎవరివో..?

**బ్యాంకుల్లో పేరుకుపోతున్న అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు**

ముంబయి: దేశవ్యాప్తంగా 64 బ్యాంకుల్లో రూ. 11,300కోట్లు అన్‌క్లెయిమ్‌డ్(ఎవరివో తెలియని) డిపాజిట్లుగా ఉన్నాయి. దాదాపు 3కోట్లకు పైగా ఖాతాల్లో ఈ సొమ్ము నిల్వ ఉంది. ఈ మేరకు ఆర్‌బీఐ విడుదల చేసిన డేటా ద్వారా వెల్లడైంది.

బ్యాంకుల్లో డిపాజిట్లు చేసి ఏళ్ల తరబడి వాటిని తీసుకోవడానికి ఎవరూ రాకపోవడం లేదా.. ఆ డిపాజిట్‌దారులు చనిపోతే వారి వారసుల వివరాలు లేకపోవడంతో ఆయా ఖాతాల్లోని డిపాజిట్లు అన్‌క్లెయిమ్‌డ్‌గా మారిపోతాయి. అలా 64 బ్యాంకుల్లోని దాదాపు 3కోట్లకు పైగా ఖాతాల్లో రూ. 11,300కోట్లు అన్‌క్లెయిమ్‌డ్‌గా ఉన్నట్లు ఆర్‌బీఐ తెలిపింది.

వీటిలో అత్యధికంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(పీఎన్‌బీ)లో రూ. 1,262కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)లో రూ. 1,250కోట్లు అన్‌క్లెయిమ్‌డ్‌గా ఉన్నాయి. ఇక మిగతా అన్ని జాతీయ బ్యాంకుల్లో కలిపి రూ. 7,040కోట్లు ఉన్నాయి. ప్రైవేటు బ్యాంకుల్లో రూ. 1,416కోట్లు అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. మిగతా రూ.332కోట్లు మన దేశంలో కొనసాగుతున్న 25 విదేశీ బ్యాంకుల వద్ద ఉన్నాయి.

ఏడు ప్రైవేటు బ్యాంకులు యాక్సిస్ బ్యాంక్, డీసీబీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, ఇండస్‌ఇండ్, కొటక్ మహీంద్రా, యస్ బ్యాంక్‌లు కలిపి రూ. 824కోట్లు, మరో 12 ప్రైవేటు బ్యాంకుల్లో రూ. 592కోట్లు అన్‌క్లెయిమ్‌డ్‌గా పడి ఉన్నాయి. వీటిలో అత్యధికంగా ఐసీఐసీఐలో రూ. 476కోట్లు, కొటక్ మహీంద్రా బ్యాంక్ వద్ద రూ. 151కోట్లు అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి.

## శ్రీదేవి దేశానికి ఏం చేశారు?

**రాజ్ ఠాక్రే వివాదాస్పద వ్యాఖ్యలు**



దిల్లీ: దివంగత నటి శ్రీదేవిపై ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఫిబ్రవరి 24న శ్రీదేవి ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో పడి మరణించిన సంగతి తెలిసిందే. ముంబయిలో అధికారిక లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

ఆదివారం ముంబయిలో జరిగిన ఎంఎన్ఎస్ ర్యాలీలో ఠాక్రే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీదేవి దేశానికి ఏం మేలు చేశారని ఆమెకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారని రాజ్ ఠాక్రే ప్రశ్నించారు. శ్రీదేవి భౌతికకాయంపై త్రివర్ణపతాకం ఎందుకు కప్పారు? ఆమె గొప్ప నటే కావచ్చు. కానీ దేశానికి ఆమె ఏం చేశారని అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు? అదీకాకుండా వేల కోట్లు ఎగ్గొట్టిన నీరవ్ మోదీ కుంభకోణం గురించి పట్టించుకోవడం మానేసి మీడియా ఆమె మృతిపైనే ఎక్కువ దృష్టిసారించింది. అన్నారు.

రాజ్ ఠాక్రే ఇంతటితోనే ఆగలేదు.. బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ నటించిన టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్ కథా, ప్యాడ్‌మ్యాన్ చిత్రాలపై కూడా ఆరోపణలు చేశారు. ఈ రెండు సినిమాలు ప్రభుత్వ పథకాల ప్రచారం కోసమేనంటూ ఆరోపించారు. అసలు అక్షయ్‌కుమార్ భారత పౌరుడే కాదని ఆయన కెనడాలో జన్మించారని ఠాక్రే అన్నారు .

# తనూజ కేటరింగ్ సర్వీస్ అండ్ సప్లయర్స్ ప్రారంభోత్సవం

మాధవధార : తనూజ కేటరింగ్ సర్వీస్ అండ్ సప్లయర్స్ షాపు మాధవధార కళింగనగర్ ప్రాంతంలో జబర్దస్త్ ఫేం రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనూజ కేటరింగ్ సర్వీస్ అండ్ సప్లయర్స్ మరింత అభివృద్ధి చెందాలని అకాంక్షించారు. తనూజ కేటరింగ్ సర్వీస్ అండ్ సప్లయర్స్ అధినేత సనపల రమేష్ మాట్లాడుతూ మధ్య తరగతి, సామాజిక తరగతి ప్రజలకు అందుబాటులో ధరల్లో కేటరింగ్ సర్వీస్, సప్లయర్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాధవ ధార ప్రాంతంలో సందడి చేశారు. ఈ ప్రారంబోత్సవ కార్యక్రమంలో జబర్దస్త్ టీం గెటప్ శ్రీను, ఆది, దోరబాబు, గణపతి, శాంతి సర్వ్యాప్ తదితరులు పాల్గొన్నారు.


తనూజ కేటరింగ్ సర్వీస్ అండ్ సప్లయర్స్‌ను ప్రారంభిస్తున్న జబర్దస్త్ టీం

# త్వరలోనే డీఎస్సీ ప్రకటన : గంటా

అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయ ఎంపిక పరీక్ష డీఎస్సీ నిర్వహణకు త్వరలోనే ప్రకటన జారీ చేస్తామని ఏపీ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. సుమారు పది వేలకుపైగా ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి ఆర్థికశాఖకు నివేదిక పంపించామని- అనుమతి రాగానే నోటిఫికేషన్ విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ వారంలోనే ప్రకటన వచ్చే వీలుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష ( టెట్- 2017) ఫలితాలను ఆయన విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో పాఠశాల విద్యా కమిషనర్ సంధ్యారాణి, కన్వీనరు సుబ్బారెడ్డితో కలిసి విడుదల చేశారు.

2013లో నిర్వహించిన టెట్‌తో పోలిస్తే ఈ సారి ఆన్‌లైన్‌లో మెట్టమొదట పరీక్ష నిర్వహించినా అర్హత సాధించిన అభ్యర్థుల సంఖ్య ఎనిమిది శాతం పెరిగిందని మంత్రి గంటా చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21 నుంచి ఈ నెల రెండో తేదీ వరకు పది రోజులపాటు ఆన్‌లైన్‌లో 190 కేంద్రాల్లో టెట్ పరీక్ష నిర్వహించామన్నారు. నాలుగో తేదీన మొదట కీ ప్రకటించి- అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తే 19,314 మంది నుంచి ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. వీటిలో 2,604 మంది ఫిర్యాదులు సహేతంగా ఉన్నట్లు గుర్తించామని- పేపర్-1 పరీక్ష రాసిన అభ్యర్థులకు ఐదు మార్కులు.. పేపర్-2లో గణితం- సైన్స్ అభ్యర్థులకు ఎనిమిది మార్కులు- సాంఘిక శాస్త్రం పేపర్‌కు



మూడు మార్కులు అదనంగా వారికి కేటాయించామని అన్నారు. మొత్తం 4,14,120 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. పేపర్-1లో 57.88 శాతం.. పేపర్-2లో గణితం- సైన్స్ 37.26 శాతం, సాంఘిక శాస్త్ర 38.22 శాతం.. పేపర్-3లో 42.60 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారని వివరించారు. సగటున 25 శాతం అభ్యర్థులు 90 కంటే ఎక్కువ మార్కులు పొందారని- 84 మంది అభ్యర్థుల ఫలితాలను విత్‌హెల్డ్‌లో ఉంచామన్నారు. పది రోజుల్లో వీటిని పరిశీలించి ఆ ఫలితాలు కూడా ప్రకటిస్తామని మంత్రి పేర్కొన్నారు.

## నా జీవితంలో అది ఓ అద్భుతమైన రాత్రి : దినేశ్ కార్తీక్



బంగ్లాదేశ్: నరాలు తెగెంత ఉత్కంఠకర మ్యాచ్‌లో చివరి బంతిని సిక్సుకు తరలించి భారత్‌కు విజయాన్నందించిన టీమిండియా వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ తన జీవితంలో ఆ రాత్రిని ఓ అద్భుతమైన రాత్రిగా అభివర్ణించాడు. నిదహాస్ ట్రోఫీలో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో దినేశ్ కార్తీక్ అద్భుత ప్రదర్శనతో భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో కార్తీక్‌పై అటు క్రికెట్ దిగ్గజాలు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ నుంచి ఇటు సామాన్య అభిమాని వరకు సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఈనేపథ్యంలో కార్తీక్ సైతం ట్విటర్ వేదికగా తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు. బహుషా నా జీవితంలో ఇది ఓ గొప్ప రాత్రి. ఇలాంటి అవకాశం మరోసారి రాకపోవచ్చు అని ట్వీట్ చేశాడు. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది.

## షమి మ్యాచ్ ఫిక్సర్ అని నేను అనలేదు

**షమి భార్య హసీన్ జహాన్ తాజా వ్యాఖ్యలు**



కోల్‌కతా: టీమిండియా పేసర్ మహమ్మద్ షమి మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడి నట్టు తాను అనలేదని చెబుతోంది షమి భార్య హసీన్ జహాన్. పది రోజుల క్రితం హసీన్.. షమికి పలువురు మహిళలతో సబంధాలున్నాయని, మ్యాచ్ ఫిక్సింగ్‌కి పాల్పడ్డాడని సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమె తాను అలాంటి వ్యాఖ్యలు చేయలేదని పేర్కొనడం గమనార్హం. షమిపై నేను ఎలాంటి మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు చేయలేదు. నాకు క్రికెట్ గురించి ఏమాత్రం అవగాహన లేదు. అలాంటిది నేను అలా ఎలా ఆరోపణలు చేస్తాను. అంతేకాదు నాపై అత్యాచారం జరిగిందని కూడా నేను అనలేదు. మీడియాలో ఏవేవో వార్తలు వస్తున్నాయి. కావాలంటే నా ఎఫ్ఐఆర్ కాపీ చూసుకోండి. ఎప్పుడైతే మా ఇద్దరికీ పెళ్లి అయ్యిందో అప్పుడే మాకు సమస్యలు మొదలయ్యాయి. గత రెండేళ్ల నుంచి విడాకులు కావాలని కోరుతున్నాడు. ఒకవేళ ఇప్పుడు నాకు షమి క్షమాపణలు చెప్పి, తప్పులన్నింటినీ ఒప్పుకున్నట్లైతే అంతా మంచే జరుగుతుంది. లేదంటే ఇక తామిద్దరం కోర్టులోనే కలిసేది అని ఆమె స్పష్టం చేసింది.

## సంచలనం సృష్టిస్తున్న టెన్త్ ప్రశ్నపత్రం లీకేజీ

హైదరాబాద్ : తెలంగాణలో పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ సంచలనం సృష్టిస్తోంది. సోమవారం ఉదయం జరగాల్సిన పదో తరగతి ఇంగ్లీష్ ప్రశ్నాపత్రం... పరీక్షకు అరగంట ముందే ఆదిలాబాద్, వనపర్తి జిల్లాలలో లీకైంది. ఓ టీచర్ ప్రశ్నాపత్రాన్ని సెల్‌ఫోన్‌లో ఫోటో తీసి సర్క్యులేట్ చేసినట్లు సమాచారం. ప్రశ్నాపత్రం లీకేజీతో పాఠశాల విద్యాశాఖ అప్రమత్తం అయింది. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. నాలుగు పోలీసు బృందాలు విచారణ జరుపుతున్నాయి.

## టీడీపీ అవిశ్వాసంతో పని లేదు : పన్నీర్‌సెల్వం



చెన్నై : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలన్న డిమాండ్‌పై తెలుగుదేశం పార్టీ కేంద్రంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం స్పందించారు. టీడీపీ అవిశ్వాస తీర్మాన్ని కావేరీ అంశంతో పోల్చరాదని అన్నారు. అవి రెండూ వేర్వేరని అన్నారు. తమిళనాడు ప్రయోజనాలే తమకు ముఖ్యమన్నారు. టీడీపీ అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా అన్నాడీఎంకే కావేరీ అంశం లేవనెత్తుతూ అడ్డుపడుతోందంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో పన్నీర్ సెల్వం ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారు.

తమిళనాడు ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎప్పుడూ రాజీపడదని పన్నీర్ సెల్వం అన్నారు. 'కావేరీ అంశాన్ని టీడీపీ వ్యవహారంతో పోల్చడం సరికాదు. కావేరీ మేనిజిమెంట్ బోర్డు ఏర్పాటుకు సుప్రీంకోర్టు 6 వారాల గడువు ఇచ్చింది. ఆలోపు ఏదీ జరగకపోతే భవిష్యత్ కార్యాచరణపై మేం చర్చిస్తాం' అని పన్నీర్ సెల్వం సోమవారంనాడు అసెంబ్లీలో మాట్లాడుతూ అననారు. టీడీపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతివ్వాలంటూ అసెంబ్లీ ప్రతిపక్ష డీఎంకే నేత ఎంకే స్టాలిన్ కోరినప్పుడు పళనిస్వామి ఈ వివరణ ఇచ్చారు.

## అవిశ్వాసం అంటే భాజపాకు ఎందుకు భయం?

**ఏపీ ఆర్థిక మంత్రి యనమల**

అమరావతి: అవిశ్వాసం అంటే భాజపా ఎందుకు భయపడుతోందని ఏపీ ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. వాళ్ల పార్టీ సభ్యులపై నమ్మకం లేకనే భయపడుతున్నారా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీపై అసంతృప్తితో ఉన్న భాజపా ఎంపీలు అవిశ్వాసంపై చర్చ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని బీజేపీ భయపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అవిశ్వాస తీర్మానంపై చర్చకు అవసరమైన సభ్యులు సంతకాలు పెట్టి.. సభ్యులు లేచి నిలబడితే ఎటువంటి సంకోచం లేకుండా నోటీసును అమోదించాలని, చర్చకు తేదీని నిర్ణయించాలని అన్నారు. దీనికి విరుద్ధంగా వ్యవహరించడం అప్రజాస్వామికమే కాకుండా పార్లమెంటరీ సంప్రదాయానికి విరుద్ధమన్నారు.

## ప్యాకేజీ గురించి పవన్‌కు అవగాహన కలిగింది

**పవన్ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం : బీజేపీ ఎంపీ హరిబాబు**



ఢిల్లీ: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ హరిబాబు స్వాగతించారు. హోదా బదులుగా ఇచ్చిన ప్యాకేజీ బ్రహ్మాండంగా ఉందని, పవన్ ప్యాకేజీ గురించి వాస్తవాలు తెలుసుకున్నందుకు సంతోషమని హరిబాబు కొనియాడారు. పవన్ కల్యాణ్ ఓ జాతీయ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ ఇప్పుడు కలకలం రేపుతోంది.

ప్రత్యేక హోదా కోసం ఆమరణ నిరాహార దీక్షకు కూడా సిద్ధమని ప్రకటించిన పవన్.. ప్రత్యేక హోదా పెద్ద విషయం కాదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రం నుంచి నిధులు రావడమే ముఖ్యమని ప్రత్యేక హోదాపై అడిగిన ప్రశ్నకు పవన్ సమాధానమిచ్చారు.

ప్రత్యేక హోదా కోసం కేంద్రంపై పోరాడుతామని చెప్పిన పవన్ ఇప్పుడు ఇలా యూటర్న్ తీసుకోవడంపై రాజకీయ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి. బీజేపీని అనుసరించే పవన్ ఇలా మాట్లాడి ఉంటారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

# దిల్లీ హైకోర్టుకు 2జీ స్పెక్ట్రమ్ కేసు!



దిల్లీ: సంచలనం సృష్టించిన 2జీ స్పెక్ట్రమ్ కేసు తీర్పుపై దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్. ఈ కేసులో టెలికాం మాజీ మంత్రి రాజా, డీఎంకే ఎంపీ కనిమొళి సహా నిందితులందరినీ నిర్దోషులుగా తేలుస్తూ గతేడాది డిసెంబరులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఈడీ నేడు దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు సంబంధిత వర్గాల సమాచారం.

యూపీఏ ప్రభుత్వ హయాంలో ఈ కుంభకోణం చోటుచేసుకుంది. ఆ సమయంలో డీఎంకేకు చెందిన ఎ. రాజా టెలికాం శాఖ మంత్రిగా వ్యవహరించారు. అయితే ఆయన నేతృత్వంలో జరిగిన 2జీ స్పెక్ట్రం కేటాయింపులో భారీ ఎత్తున అవినీతి జరిగిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) ఆరోపించింది. ఈ అవినీతి వల్ల ప్రభుత్వానికి రూ.1.76లక్షల కోట్ల నష్టం వాటిల్లినట్లు పేర్కొంది.

కాగ్ ఆరోపణలు చేయడంతో 2010లో ఎ. రాజాను అప్పటి ప్రభుత్వం పదవి నుంచి తప్పించింది. ఈ కుంభకోణంపై సీబీఐ, ఈడీ దర్యాప్తు చేపట్టింది. రాజా, డీఎంకే ఎంపీ కనిమొళి సహా 17 మంది నేతలు, కార్పొరేట్ సంస్థల అధికారులపై ఛార్జిషీట్ దాఖలు చేశారు. 2011లో రాజాను అరెస్టు చేశారు. ఏడాది పాటు జైల్లో ఉన్న రాజా ఆ తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు.

ఈ కేసుకు సంబంధించి గతేడాది డిసెంబరులో సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం అనూహ్య తీర్పు వెల్లడించింది. ఈ కేసులో రాజా, కనిమొళితో పాటు నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. నిందితులపై ఆరోపణలను రుజువు చేయడంతో ప్రాసిక్యూషన్ విఫలమైందని న్యాయస్థానం ఆ సందర్భంగా పేర్కొంది.

దీంతో ఈ కేసు నుంచి వారంతా బయటపడ్డారు. అయితే తాజాగా ఈడీ ఈ తీర్పును సవాల్ చేయడంతో ఈ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది.

# నూకాంబికాను దర్శించుకున్న ప్రముఖులు

**నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న సీని గాయకుడు చంద్రబోస్, పీలా శ్రీకాంత్ దంపతులు**







అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబికా అమ్మవారి జాతలో భాగంగా ఉగాది పర్వదినాన పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శించుకున్నవారిలో విశాఖ రూరల్ ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ దంపతులు, సినీ గాయకుడు సుబాష్ చంద్రబోస్, ఎమ్మెల్యే తనయుడు పీలా శ్రీకాంతు, అనూషా దంపతులు, మాజీమంత్రి వర్యులు కొణతాల రామకృష్ణ, డాక్టర్ విష్ణుమూర్తి, సత్యవతి, దంపతులకు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో సుజాత, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొణతాల వెంకటరావు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని చిత్ర పటాన్ని అందజేసారు. అలాగే జిల్లాలో అధికారులు, ప్రముఖులు అధిక సంఖ్యలో ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com